# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 170 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య పేజీలు : 8 వెల రూ. 2 సోమవారం -21 - సెప్టెంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898


## యెమెన్‌లో భీకర పోరు.. 24 గంటల్లో 44 మంది మృతి




- యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీల మధ్య భీకర పోరు
- తాయిజ్, లహజ్ ప్రావిన్సుల్లో కొనసాగుతున్న ఘర్షణలు
- వ్యూహాత్మక ప్రాంతాలకు బలగాలను తరలిస్తున్న ఇరు పక్షాలు

## సౌదీకి సాయం చేస్తే ఉక్కు పిడికిలితో బదులిస్తాం: పాక్, టర్కీకి హౌతీల హెచ్చరిక




సౌదీ అరేబియాకు సైనిక మద్దతివ్వొద్దని పాకిస్థాన్, టర్కీకి హౌతీల హెచ్చరిక

జోక్యం చేసుకుంటే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయన్న హౌతీ నేత మహ్మద్ అల్-బుఖైతీ

సౌదీ, పాక్, టర్కీ మధ్య కుదిరిన 'ముక్కా రక్షణ ఒప్పందం'తో పెరిగిన ఉద్రిక్తతలు




## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం
- సోమవారం నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

## ఏపీలో 9 కొత్త రైల్వే లైన్లు.. పోర్టులకు పెరగనున్న కనెక్టివిటీ




- ఏపీలో కొత్త రైల్వే లైన్లు ఏర్పాటుకు రైల్వే శాఖ సన్నాహాలు
- పశ్చిమ, మధ్య భారతం నుంచి ఏపీ పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ లక్ష్యం
- రాయలసీమ నుంచి పోర్టులకు దూరం తగ్గించేలా కీలక ప్రతిపాదనలు
- తెలంగాణ నుంచి శ్రీశైలానికి రైలు మార్గం ఏర్పాటుకు ప్లాన్
- ప్రయాణ సమయం, సరుకు రవాణా ఖర్చులు తగ్గించడమే ప్రధాన ఉద్దేశం

# విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి

### విద్యతో సమాజంలో మార్పు తీసుకురావొచ్చు

విద్య, ప్రభుత్వ పాఠశాలలు అంటే సీఎం చంద్రబాబుకు చాలా ఇష్టం

గతంలో బాపట్లలో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు సీఎం వచ్చారు



కాకినాడ: విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావొచ్చని చెప్పారు. కాకినాడ జిల్లా ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో ప్రముఖ ప్రవచనకర్త, ఏపీ ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, ప్రభుత్వ పాఠశాలలు అంటే సీఎం చంద్రబాబుకు చాలా ఇష్టమని, గతంలో బాపట్లలో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు సీఎం వచ్చారని గుర్తు చేశారు. నాడు పిల్లలకు పెట్టే భోజనమే సీఎంకు వడ్డిస్తే.. ఈ భోజనం క్వాంటిటీ సరిపోదు.. పెంచాలని చెప్పారని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఓర్పు, సహనం, నైతిక విలువలు చాలా అవసరమన్న లోకేశ్.. దేశం కోసం ఆలోచించాలని, త్యాగాలకు కూడా వెనకాడకూడదని చెప్పారు. విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.




## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- సెప్టెంబర్ 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు
- అనంత చతుర్దశి రోజున నిమజ్జన కార్యక్రమం

## జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన

### వైఎస్ జగన్ వార్నింగ్‌తో దిగొచ్చిన చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన అల్టిమేటం



విజయవాడ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన అల్టిమేటం నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో కదలిక కనిపించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, కరువు మండలాలను ప్రకటించాలని జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై అధికారులతో సమీక్షించిన సీఎం.. అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించనున్నట్లు శనివారం స్వయంగా వెల్లడించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు, రైతుల సమస్యలు, మిగతా 2 లో

## వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం..

### ఇక అప్పులపైనే ఆధారపడం

కీలక ప్రాజెక్టులకు నిధుల కోసం ప్రైవేటు పెట్టుబడులపై దృష్టిపెడతాం...

పెట్టుబడిదారుల నష్టభయం తగ్గించేలా ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగిస్తాం

30 వేల ఎకరాల్లో నెట్--జీరో మెగాసిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ



న్యూఢిల్లీ: తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం మిగతా 2 లో




## మీ ఆస్తులు.. మా ఆస్తులపై విచారణకు సిద్ధమా?: హరీశ్‌రావు

- కాంగ్రెస్ పాలన వల్ల ఎవరికీ లాభం లేదు
- మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా?
- 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?"
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కాల్వ కూడా తవ్వలేదు
- " కాంగ్రెస్ నేతలు చేస్తున్న భూ కబ్జాపై మాట్లాడినందుకే మాపై దాడి చేశారు

# విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలి

### కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు

వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైంది



హైదరాబాద్: విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని చెప్పారు. విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని సమావేశంలో అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందన్నారు. ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని అధికారులు వివరించారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని అన్నారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి , ఎంపీ వేం నరేందర్ రెడ్డి తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి

### రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ సవాల్




- ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి
- కరెంటు కోతలతో రైతులు అల్లాడుతున్నారని.. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం
- ప్రకృతి కావాల్సినన్ని నీళ్లు ఇచ్చినా రైతులకు సాగునీరు లేదు"
- అక్రమాలు జరిగితే ప్రజలకు చూపించి యాక్షన్ తీసుకోవాలి

# ధర్మశాలలో ఘనంగా వినాయక పూజ

## - భక్తులకు అన్నదానం:-ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని ధర్మశాల వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కుడుముల రజిత వెంకటేష్ , పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి విచ్చేసి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు కేవలం పండుగ మాత్రమే కాదు, ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చే సామాజిక సేవా కార్యక్రమం అని, ధర్మశాల కమిటీ ప్రతి ఏటా ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు ఆంజనేయులు , పిఎసిఎస్ డైరెక్టర్ నర్సింహులు , మాజీ కౌన్సిలర్ మల్లేష్ , ఎదిరి కృష్ణ , ఉమా శంకర్ , ఎన్నవరం సంతోష్ , జీవన్ రెడ్డి , అరవింద్ మహిళా భక్తులుగారు తదితరులు పాల్గొన్నార



# యావజ్ గూడెంలో స్మార్ట్ కార్డుల పంపిణీ

## -మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట రాములు





వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని పరిగి మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట్ రాములు అన్నారు. ఆదివారం పరిగి మండల పరిధిలోని యావోజిగూడెం గ్రామంలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు యావోజిగూడెం గ్రామంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కచ్చితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎప్పుడు జరగని అభివృద్ధి ఈరోజు పరిగిలో జరుగుతున్నదన్న విషయాన్ని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ నర్సింలు, గ్రామ మాజీ సర్పంచ్ శశిధర్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

# ఖుదవాన్ పూర్ లో పాషాను పరామర్శించిన

## – మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట రాములు

టి ఆర్ ఆర్ ఆస్పత్రిలో వారం రోజులపాటు చికిత్స పొంది ఖుదాన్పూర్ గ్రామానికి వచ్చిన మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాషా

అనారోగ్యానికి గురైన వారు ఎవరైనా సరే టిఆర్ఆర్ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స పొందవచ్చు: జి వెంకట రాములు.



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి మండలం కుదవాన్ పూర్ గ్రామానికి చెందిన మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాషా అనారోగ్యాన్ని గురై పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి ఆసుపత్రిలో వారం రోజులపాటు చికిత్స పొంది ఆరోగ్యంగా మారి కుదాన్పూర్ గ్రామానికి వచ్చిన పాషను పరిగి మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట్ రాములు ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ నిరాశ నిస్ప్రోలకు గురికావాల్సిన అవసరం లేదని పరిగి నియోజకవర్గానికి సంబంధించిన వ్యక్తులు అనారోగ్యాన్ని గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారు ఎవరైనా సరే మన ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి టిఆర్ ఆర్ ఆసుపత్రికి వెళ్లి ఉచితంగా చికిత్స చేయించుకోవచ్చని పేర్కొన్నారు. ఈరోజు అందులో భాగంగానే మన పరిగి మండలం ఖుదాన్పూర్ గ్రామానికి చెందిన మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాషా అనారోగ్యాన్ని గురైన విషయం అందరికీ తెలిసిందనని టీఆర్ ఆర్ ఆస్పత్రి లో చికిత్స పొంది సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా మళ్లీ కుదాన్పూర్ గ్రామానికి చేరుకున్నారని ఇది చాలా సంతోషకరమైన విషయం అని మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట్ రాములు వెంబడి నాయకులు తదితరులు ఉన్నారు.

# పరిగిలో గ్రీన్ మర్చంట్ ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు...





వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పట్టణంలోని మార్కెట్ యార్డులో గ్రీన్ మర్చంట్ ఆధ్వర్యంలో వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో గ్రీన్ మర్చంట్ సభ్యులు, మహిళలు పూజా కార్యక్రమం ద్వారా విఘ్నేశ్వరుని కృపా కటాక్షాలు అందరికీ లభించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి, నవరాత్రులలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళలో గణనతుడి కి కుంకుమర్చినలు, అష్టోత్తర శతనామావళి పూజలు విశేష హారతులు ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గణనాథుని కరుణ కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ మర్చంట్ సభ్యులు శ్రీనివాస్ గుప్తా, ప్రభాకర్ గుప్తా, వీరేశం గుప్తా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# చత్రాజీ ఆసుపత్రిలో గణేష్ వేడుకలు... నిమజ్జనానికి తరలిన గణనాథుడు!

### చిత్రాజి ఆసుపత్రిలో ఐదు రోజులపాటు నిత్యం పూజలు అందుకున్న గణనాథుడికి ఘనంగా నిమజ్జనం

### నిమజ్జనంలో పాల్గొన్న ఆసుపత్రి ఎండి డాక్టర్ రాజేందర్ కుటుంబ సభ్యులు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదు రోజులపాటు చిత్రాజీ ఆసుపత్రిలో నిత్యం పూజలు అందుకున్న గణనాథుని శుక్రవారం సాయంత్రం లక్నాపురం ప్రాజెక్టుల్లో నిమజ్జనం చేయుటకు తరలించారు. నిమజ్జనం కార్యక్రమంలో చత్రాజి హాస్పటల్ సిబ్బంది ఆస్పత్రి ఎండి డాక్టర్ రాజేందర్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని గణనాథుని ఘనంగా నిమజ్జనం కు తరలించారు. నిమజ్జనం సమయంలో ఆస్పత్రి ఎండి సిబ్బందితో కలిసి ఆటపాటల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆస్పత్రి యాజమాన్యం సిబ్బంది కాకుండా చుట్టుపక్కల ఉన్న భక్తులు సైతం భారీ సంఖ్యలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని నిమజ్జనాన్ని విజయవంతం చేశారు




# గుండ్రేవుల ప్రాజెక్టును సాధించి తీరుతాం

## గుండ్రేవుల సాధన కోసం సంతకాల సేకరణ

## కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష



కర్నూలు, సెప్టెంబర్ 20: (మహి న్యూస్): కర్నూలు జిల్లాకు కీలకమైన గుండ్రేవుల ప్రాజెక్టును సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష తెలిపారు. గుండ్రేవుల ప్రాజెక్టు సాధనలో భాగంగా ఆదివారం బిర్లా కాంపౌండ్‌లోని కేపీఎస్ కార్యాలయంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు సరిపడా నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో నీటి కొరతను శాశ్వతంగా అధిగమించేందుకు గుండ్రేవుల ప్రాజెక్టు అవసరమని పేర్కొన్నారు. కర్నూలు నగరంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి సైతం నీటి కొరత ఎదురవుతున్న పరిస్థితిని ప్రస్తావిస్తూ, జిల్లాలో తగిన నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులు అవసరమని అన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు సాధన కోసం ప్రజలంతా భాగస్వాములు కావాలని శ్రీహర్ష పిలుపునిచ్చారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున సంతకాలు సేకరించి, వారి ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించేందుకు గుండ్రేవుల ప్రాజెక్టు కీలకమని పేర్కొంటూ, ప్రాజెక్టు సాధన కోసం ప్రజలతో కలిసి నిరంతరం ఉద్యమం కొనసాగిస్తామని శ్రీహర్ష స్పష్టం చేశారు.






# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.. ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

## విద్యార్థులకు జిల్లా యువజన అధికారి టీ. ఇసయ్య సూచన




కర్నూలు, సెప్టెంబర్ 20: (మహి న్యూస్): మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి




సారించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని మై భారత్ కేంద్రం జిల్లా యువజన అధికారి టీ. ఇసయ్య విద్యార్థులకు సూచించారు. కర్నూలులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్య రహిత భారత్ అవగాహన కార్యక్రమాన్ని మై భారత్ కేంద్రం, జిల్లా యువజన సంక్షేమ శాఖ--సెట్‌కూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ నాటిక ప్రదర్శించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వాటిని అక్రమంగా కొనుగోలు చేయడం, విక్రయించడం, సరఫరా చేయడం, రవాణా చేయడం వల్ల ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. సెట్‌కూర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ



మాదకద్రవ్యాలకు విద్యార్థులు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, విద్య, ఆర్థిక పరిస్థితులు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా యువజన అధికారి టీ. ఇసయ్య మాట్లాడుతూ చెడు స్నేహాలు, తోటి విద్యార్థుల ఒత్తిడికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. ఈగల్ టీం ప్రతినిధి మసూమ్ బాషా మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, సరఫరా, రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని కోరారు. ఎక్సైజ్ సీఐ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. ఖాళీ సమయాన్ని క్రీడలు, పఠనం, యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవకు వినియోగించుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు శెట్టి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్యం, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో విద్యాసంస్థల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ, సెట్‌కూర్ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ శాఖలు సమష్టిగా కృషి చేస్తే మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించవచ్చని కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేశారు.

# అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం సర్వసభ్య సమావేశం




కర్నూలు సెప్టెంబర్ 20,(మహి న్యూస్): కర్నూల్ నగరంలోని స్థానిక పాత బస్టాండ్ లోని లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మండపం లో అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం వార్షిక సర్వ సభ్య సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న సత్రం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో సత్రం అభివృద్ధికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో మాట్లాడిన నిత్యాన్నదాన సత్రం అధ్యక్షులు కోనూరు సతీష్ శర్మ, సత్రం సాధించిన విజయాలను మరియు భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. సత్రం గత 130 సంవత్సరాలుగా నిత్యాన్నదానం మరియు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఈ సేవలను మరింత విస్తరించడానికి తాము కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు.



భద్రాచలం, క్షేత్రకూట, కాశీ, తిరుపతి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలలో సత్రం భవనాల నిర్మాణానికి మరియు వసతుల మెరుగుదలకు బడ్జెట్ కేటాయించినట్లు ఆయన తెలిపారు. సత్రం ప్రధాన కార్యదర్శి మనోహర్ రావు మాట్లాడుతూ, సత్రం గత ఐదు దశాబ్దాలుగా వేద పాఠశాలను నిర్వహిస్తోందని, ఈ పాఠశాలలో విద్యార్థులకు వేద విద్యతో పాటు ఆధునిక విద్యను కూడా అందిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా 18 బ్రాంచ్‌లతో సత్రం విరాజిల్లుతోందని, అన్నవరం వంటి ప్రాంతాల్లో నూతన బ్రాంచ్‌లు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. సత్రం కోశాధికారి కార్తమూర్తి కరణం చిదంబరం మాట్లాడుతూ, సత్రం ఆర్థిక నిర్వహణ మరియు బడ్జెట్ ప్రణాళికలను వివరించారు. సత్రం ఆర్థికంగా పటిష్టంగా ఉందని మరియు సేవా కార్యక్రమాల కోసం తగిన నిధులు ఉన్నాయని ఆయన తెలిపారు. సత్రం ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆర్. శ్రీనివాస్ మరియు ప్రచార కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ కూడా సమావేశంలో ప్రసంగించి, సత్రం అభివృద్ధికి సంబంధించిన తమ సూచనలను మరియు సలహాలను అందించారు. సమావేశంలో సత్రం సభ్యులు అందరూ ఏకగ్రీవంగా బడ్జెట్ ప్రతిపాదనలను మరియు ఇతర నిర్ణయాలను ఆమోదించారు. సమావేశం ముగింపులో, సత్రం అభివృద్ధికి సహకరించిన దాతలను మరియు సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ ఎస్ఆర్ శ్రీనివాస్, సెక్రెటరీ వేణు గోపాల్ జాయింట్ సెక్రెటరీ చిలంబరరావు ఈసీ నెంబర్ మనోహరరావు వర్కింగ్ కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ సతీష్ శర్మ కమిటీ మెంబర్ నరసింహ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు కన్నీరు రాష్ట్రానికి అరిష్టం కాదా: పేర్ని నాని

పెనమలూరు: ఆంధ్రప్రదేశ్‌లో దౌర్భాగ్య పరిస్థితులు ఉన్నాయని, రైతు కన్నీరు రాష్ట్రానికి అరిష్టం కాదా? అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ఆదివారం కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గ వైసీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు నేతలు దిశానిర్దేశం చేశారు. ఇందులో పేర్ని నాని మాట్లాడుతూ... "స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలి. వైసీపీ జెండా రెపరెపలాడాలి. చంద్రబాబు తన ధన బలంతో ఓటర్లను ప్రలోభ పెడతారు. ఓటర్లను డబ్బుతో కాదు ప్రేమతో కొనాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో మానవత్వం..మంచితనం ఉన్న అభ్యర్థిని నిలబెట్టండి. వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్ మోహన్ రెడ్డితో చక్రవర్తి ఉన్నారు. పెనమలూరు నుంచి మళ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దేవభక్తుని చక్రవర్తి నిలబడతారు. ఈ ప్రభుత్వంలో యూరియా, డీఏపీ దొరక్క రైతు కష్టాలు పడుతున్నారు. యాప్ ద్వారా ఎరువులు తెచ్చుకోవాలని రైతులను కాల్చుకుతింటున్నారు. వైఎస్ జగన్ హయాంలో ఆర్బీకే ద్వారా ఎరువులు అందించాం" అని చెప్పారు.



### ప్రభుత్వాలు కూలిపోతాయి

రైతు కన్నీరు పెడితే ప్రభుత్వాలు కూలిపోతాయని పేర్ని నాని అన్నారు. "రాష్ట్రంలో కరెంట్ కోతలు మొదలయ్యాయి. రాబోయే రోజుల్లో వైఎస్ జగన్ పై చంద్రబాబు అండ్ ముఠా మతం అనే విషయుద్ధం చేయబోతున్నారు. వైఎస్ జగన్‌ను వదులుకున్నామని జనం బాధపడుతున్నారు. చంద్రబాబు , లోకేశ్‌కు డబ్బు పిచ్చి పట్టిందని సొంత పార్టీ వాళ్లే అంటున్నారు. వైఎస్ జగన్ కంటే ఎక్కువగా ఏమీ చేయలేదని చంద్రబాబుకు అర??థమైపోయింది. అందుకే మతం అనే ముద్రతో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారు. క్రైస్తవ సభల్లో చంద్రబాబు మాట్లాడింది నీకు వినపడలేదా ఏబీఎన్ రాధాకృష్ణ? చంద్రబాబు పాపాలను దేవుడు వెంట వెంటనే బయటపెట్టేస్తున్నాడు. తిరుపతి లడ్డూలో ఏ జంతువు కొవ్వూ లేదని ఈడీ, సీబీఐ చెప్పింది. తిరుపతి వేంకటేశ్వరస్వామి ఎంత గొప్పవాడో ఇంతకంటే నిదర్శనం ఏముంది? మతం మార్చి ఓటు బ్యాంకుగా తీర్చిదిద్దారని వైఎస్ జగన్ పై తప్పుడు వార్తలు రాస్తున్నారు. అధికారం కోసం ఎంత దుర్మార్గంగానైనా ఈనాడు, జ్యోతి వార్తలు రాస్తాయి. మీ కులం తప్ప మరో కులం అధికారంలో ఉండకూడదా? కమ్మ కులస్తులే ఈ ప్రభుత్వాన్ని తిట్టుకుంటున్నారు. ఏ కార్యాలయానికి వెళ్లినా డబ్బులేనిదే పని కావడం లేదు" అని చెప్పారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# మీకోసం 1100 సేవలను సద్వినియోగం చేసుకోండి



అనంతపురం, సెప్టెంబర్ 20 (మహి న్యూస్): ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం మీకోసం టోల్‌ఫ్రీ నంబర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సూచించారు. పరిష్కారం కాని పాత ఫిర్యాదుల వివరాలు తెలుసుకోవడంతో పాటు కొత్త అర్జీలను మీకోసం వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రెవెన్యూ పరిధిలోని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాల్లో “మీకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100” బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

### 21న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఈనెల 21న సోమవారం ఉదయం 10 గంటల నుంచి అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని, గతంలో అర్జీ ఇచ్చిన వారు సంబంధిత రసీదు తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైన తర్వాత ఫోన్‌కు సందేశం వస్తుందని తెలిపారు. డివిజన్, మండల, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ స్థాయిల్లోనూ సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, పీడీఓలను ఆదేశించారు.

# పి.జి.ఆర్.ఎస్‌పై క్యూ.ఆర్. కోడ్‌తో స్పందన తెలియజేయండి




అనంతపురం, సెప్టెంబర్ 20 (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందనను క్యూ.ఆర్. కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ కోరారు. పి.జి.ఆర్.ఎస్‌ను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించేందుకు ప్రజల నుంచి నిరంతరం అభిప్రాయాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూ.ఆర్. కోడ్‌లను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పి.జి.ఆర్.ఎస్ సేవలు పొందిన అనంతరం ప్రజలు తమ మొబైల్ ఫోన్‌తో క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేసి స్పందనను నమోదు చేయవచ్చని తెలిపారు. నోటీసు బోర్డులు, సహాయ కేంద్రాలు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద కూడా క్యూ.ఆర్. కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూ.ఆర్. కోడ్ ద్వారా అందించే స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్‌కు చేరుతుందని తెలిపారు. అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే పి.జి.ఆర్.ఎస్‌లో ప్రజలు తమ అర్జీలు సమర్పించి, సేవలపై తమ అభిప్రాయాన్ని క్యూ.ఆర్. కోడ్ ద్వారా తెలియజేయాలని కలెక్టర్ కోరారు.

# 77వ కేంద్ర సిల్క్ బోర్డు వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ




అనంతపురం / బెంగళూరు, సెప్టెంబర్ 20 : - కర్ణాటక రాజధాని బెంగళూరులోని డా.బాబు రాజేంద్ర ప్రసాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కేంద్ర సిల్క్ బోర్డు 77వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో కేంద్ర సిల్క్ బోర్డు సభ్యులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ గారు, కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు, కార్మిక - ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.





- ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో పట్టుగూళ్ల ఉత్పత్తిని విస్తృతస్థాయిలో పెంచి, ప్రపంచంలోనే మన దేశాన్ని పట్టు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పట్టు రైతుల సమస్యలను తెలుసుకుని, వారికి అవసరమైన సహాయం అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. పట్టు పరిశ్రమ అభివృద్ధితో రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి

## ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు గూళ్యం నాగభూషణం మ ద్దుల చెరువు వెంకీ మద్దుల చెరువు ప్రకాష్ పిలుపు



**అనంతపురం, మహి న్యూస్ సెప్టెంబర్ 20 : ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు ప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు గూళ్యం నాగభూషణం మద్దలచెరువు వెంకీ మొదలచెరువు ప్రకాష్ పిలుపునిచ్చారు.ఎస్సీ వర్గాల సంక్షేమం, స్వయం ఉపాధి, విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం గతంలో అమలైన వివిధ పథకాలను పునరుద్ధరించాలని వారు కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువత, పేద కుటుంబాలకు రాయితీ రుణాలు, సబ్సిడీతో కూడిన స్వయం ఉపాధి పథకాలు అందుబాటులో ఉండేవని పేర్కొన్నారు. రవాణా, వైద్య, వ్యవసాయ, పాడి పరిశ్రమ, చిన్న వ్యాపారాలు తదితర రంగాల్లో ఆర్థిక సహాయం అందించే విధానాలను కొనసాగించాలని కోరారు.విద్యార్థుల కోసం ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్ల నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. చీూఖీణజ, చీూఖఖీణజ వంటి జాతీయ ఆర్థిక సంస్థల ద్వారా తక్కువ వడ్డీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఆయా వర్గాల సంక్షేమానికే వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, యువత, మహిళలు, వ్యవసాయ కూలీలు, చిన్న వ్యాపారులకు ఆర్థికంగా అండగా నిలిచే పథకాలను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.సెప్టెంబర్ 28న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మధు ప్రసాద్, గూళ్యం నాగభూషణం కోరారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.**

# బ్రిక్స్ సూపర్ సక్సెస్!




చేరుకోవాల్సిన లక్ష్యంపై స్పష్టత, అందుకు అనుసరించాల్సిన మార్గంపై ఏకాభిప్రాయం సాధించగలిగితే శిఖరాగ్ర సమావేశాలు విజయవంతమవుతాయి. ఆ రెండూ లేకుంటే ఉత్త లాంఛనప్రాయ సమావేశాలుగా మిగులుతాయి. ఆ కోణంలో శని, ఆదివారాల్లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఘన విజయం సాధించినట్టు లెక్క. అలాగని ఈ సమావేశాలు సమీప భవిష్యత్తులో బ్రిక్స్ కరెన్సీని తీసుకురావాలని నిర్ణయించలేదు. అలాగే ఎడాపెడా సుంకాలు విధిస్తున్న అమెరికాను నిలదీయలేదు. పశ్చిమాసియా కల్లోలానికి నువ్వే కారణమని వేలెత్తి చూపలేదు. ఈ అంశాల్లో లౌక్యం ప్రదర్శిస్తూనే చేయదల్చుకున్నది చేయటంలో బ్రిక్స్ సఫలీకృతమైంది. ఇవి మాత్రమే కాదు... పరస్పరం కలహించుకుంటున్న ఇరాన్, దాని ప్రత్యర్థులు యూఏఈ, సౌదీలను సమావేశాలకు రప్పించగలిగింది. పైగా ఇరాన్, యూఏఈ మధ్య ప్రత్యక్ష చర్చలు జరిగాయి. దక్షిణ చైనా సముద్రం విషయంలో విభేదాలున్న చైనా, ఫిలిప్పీన్స్ కూడా సదస్సుకు హాజరయ్యాయి. భారత్, చైనాల వివాదం సరేసరి. ఇలా పరస్పర విరుద్ధ ప్రయోజనాలు గల దేశాలన్నీ ఒక ఉమ్మడి డిక్లరేషన్ ప్రకటించటం చిన్న విషయం కాదు. అతిథేయ దేశంగా భారత్ ప్రత్యేక కృషి ఇందులో కనబడుతుంది. సభ్య దేశాలతో ఓపిగ్గా చర్చించాలి. ఒప్పించాలి. ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన టీమ్ ఆ పని చేయగలిగినందుకు అభినందించాలి. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో దక్షిణార్ధ గోళ దేశాల స్వరం వినిపించటంలో ఏదోమేరకు కృషి చేసిన అలీనోద్యమ సంస్థతో బ్రిక్స్‌కు పోలికలున్నాయి. కానీ వాటిమధ్య వ్యత్యాసం కూడా ఉంది. అప్పటి ద్విధ్రువ ప్రపంచంలో స్వతంత్రంగా మనగలగటానికి అవసరమైన ఆర్థిక సంపత్తి అలీనోద్యమానికి లేదు. బ్రిక్స్ అలా కాదు. అందులో పూర్తి స్థాయి సభ్యత్వంగల 11 దేశాలను చూసినా వాటి ఉమ్మడి దేశీయోత్పత్తి (జీడీపీ) వాటా ప్రపంచ జీడీపీలో 40 శాతం. ప్రపంచ జనాభాలో సగం ఈ దేశాల్లోనే ఉంది. ప్రపంచంలో చైనా రెండో పెద్ద ఆర్థిక వ్యవస్థ. రష్యావద్ద అపారమైన చమురు నిక్షేపాలు, ఆయుధ నిల్వలు ఉన్నాయి. మనతోసహా బ్రిక్స్ దేశాలన్నీ ఆర్థికంగా చురుగ్గా ఎదుగుతున్న దేశాలు. బ్రెజిల్ అయితే దక్షిణమెరికా ఆర్థిక వ్యవస్థల్లో అతి పెద్దది. ఇవన్నీ సమష్టిగా దక్షిణార్ధ గోళ దేశాలను ఆర్థికంగా, రాజకీయంగా ప్రభావితం చేయగల స్థితిలో ఉన్నాయి. ఇన్ని అనుకూలాంశాలున్నా అమెరికాపై నేరుగా ధిక్కార స్వరం వినిపించనప్పుడు ప్రయోజనమేమిటన్న సందేహం వస్తుంది. ఆ ప్రక్రియ క్రమబద్ధంగా సాగాలి. భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు తదితర సంస్థల్లో వర్ధమాన దేశాలకు మరింత మెరుగైన చోటీయాలని బ్రిక్స్ కోరుతోంది. కానీ అది అమెరికా ఆధిపత్యాన్ని ప్రశ్నించే డిమాండ్‌గా మారకుండా సదస్సు జాగ్రత్తపడింది. డాలర్ వాడకాన్ని క్రమేపీ తగ్గించుకునే ప్రక్రియలోనూ అదే ఎత్తుగడ పాటించింది. ఆ దిశగా అడుగులేస్తే బ్రిక్స్ దేశాలపై వంద శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం చేయటానికి ముందే 2024 డిసెంబర్‌లో డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఆ బెదిరింపుల్ని ఆయన అడపా దడపా కొనసాగిస్తూనే ఉన్నారు. అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ ఉనికిలో లేకుంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది మరి! అందుకే కావొచ్చు... ఆ విషయంలో బ్రిక్స్ సంయమనం పాటించింది. అది వేరే రూపంలో ఇప్పటికే అమలవుతోంది. చైనా, రష్యా 90 శాతం ద్వైపాక్షిక వాణిజ్యాన్ని తమ తమ కరెన్సీల్లో జరుపుకొంటున్నాయి. రష్యా చమురు విక్రయాలకు మన దేశం రూపా యిల్లో చెల్లించింది. డాలర్ రద్దు చేయకుండానే దాని వాడకాన్ని తగ్గించటం బ్రిక్స్ దేశాలు ఎంచుకున్న పద్ధతి. ఐఎంఎఫ్ డేటా ప్రకారం ఇప్పటికీ ప్రపంచ విదేశీ మారకద్రవ్య నిల్వల్లో డాలర్ వాటా 56.77 శాతం. యూరో కరెన్సీ వాటా 20.25 శాతం. చైనా కరెన్సీ రెన్‌మిన్‌బి(ఆర్‌ఎంబీ) వాటా కేవలం 1.95 శాతం. డాలర్ నిల్వలు పుష్కలంగా ఉన్న చైనా మరో కరెన్సీని వినియోగించాలనుకున్నా దానికే నష్టం. మనకూ ఆ సమస్యవున్నా, అమెరికా ఆధిపత్యం స్థానంలో చైనాను అంగీకరించటానికి సిద్ధపడలేం. ఈ బహుళ ధ్రువ ప్రపంచంలో ఎవరి జాగ్రత్తలు వారివి. ఈ దశలో అస్పష్టతతోనైనా బ్రిక్స్ ఉమ్మడి ప్రకటన వెలువరించటం దానికదే ఘన విజయం.

# బ్రిటన్‌లో వేర్పాటు భేరి!



బ్రిటిష్ వలస పాలకులు తాము తప్పుకున్న మరుక్షణం భారత్ చిన్నాభిన్నం కావటం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పుడు ఆ దేశమే ముక్కలయ్యే స్థితి ఏర్పడింది. మొన్న సోమవారం స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్‌లు(మన దగ్గర సీఎంల హోదాతో సమానం) అనధికార సమావేశం జరిపి, తమ స్వాతంత్ర్య ఆకాంక్షను వ్యక్తం చేసే ప్రకటనపై సంతకాలు చేశారు. దేశం కలిసుండాలా, విడిపోవాలా అనేది... అందుకు అనుసరించాల్సిన పద్ధతేమిటన్నది లండన్‌లోని జాతీయ పార్లమెంటు మాత్రమే నిర్ణయించాల్సిన అంశం కాబట్టి, ఇప్పటికప్పుడు దీనివల్ల జరిగేదేమీ ఉండదు. కానీ ఆర్థిక సంక్షోభాలు అగ్రరాజ్యాల్ని సైతం ఎలా కుదిపేస్తున్నాయో చెప్పడానికి తాజా పరిణామం ఉదాహరణ. అమెరికాపై పాతికేళ్లనాడు ఉగ్రదాడి జరిగినప్పుడు 3,000 మందిని పొట్టనబెట్టుకోవడం మినహా ఆ ఉగ్రవాదులు సాధించిందేమిటన్న ప్రశ్న వినబడింది. అటు తర్వాత అమెరికా సవ్యంగావుంటే ఉగ్రవాదం అంతరించేది. కానీ జరిగిందంతా అందుకు భిన్నం. అప్పట్లో అందరినుంచీ అమెరికాకు మద్దతు లభించింది. కొత్తగా అధికారంలోకొచ్చిన రష్యా అధినేత పుతిన్ అమెరికా ప్రారంభించిన ‘ఉగ్రవాదంపై యుద్ధా’నికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, తాలిబన్ల వేటకు మధ్య ఆసియాలోని పూర్వపు సోవియెట్ సైనిక స్థావరాల వినియోగానికి ఉదారంగా అనుమతించారు. నాటో ఆవిర్భవించి అప్పటికి యాభైయ్యేళ్లు దాటగా... అందులోని మొదటి క్లాజు ‘సమష్టి రక్షణ’ను తొలిసారి ఉపయోగించి ఆ సంస్థ అమెరికాకు బాసటగా నిలిచింది. ఇలా చిన్నా పెద్దా దేశాలన్నీ తాలిబన్‌ల వేటకు తోడ్పడ్డాయి. కానీ దీన్ని అమెరికా దుర్వినియోగం చేసింది. మానవహక్కుల ఉల్లంఘన సంగతలా వుంచి ఇరాక్ మొదలు పలు దేశాలపై విరుచుకుపడి ధ్వంసరచనకు, మారణహోమాలకు పాల్పడింది. లక్షల కోట్ల డాలర్లను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేసింది. ప్రతీకారేచ్ఛ క్రమంలో తాను దివాలా తీస్తున్నాననీ, నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నాననీ, చైనాపై కన్నేసి వుంచాలన్న సంగతి మరిచాననీ గ్రహించలేక పోయింది. ఉగ్రదాడికి ముందు మిగులు బడ్జెట్‌లో ఉన్న అమెరికా ఇప్పుడు 40 లక్షల కోట్ల డాలర్లకుపైగా అప్పుల్లో కూరుకుపోయింది. కరోనా మహమ్మారి పాత్ర కూడా ఇందులో ఉండొచ్చు గానీ... విచక్షణారహిత యుద్ధాల పరంపరే దాన్ని ఈ స్థితికి చేర్చింది. ‘తిలా పాపం తలా పిడికెడు’ అన్నట్టు యుద్ధాల్లో పాలుపంచుకున్న నాటో బలహీన పడింది. అన్ని దేశాలూ ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఈ కష్టాల పరంపరనుంచి గట్టెక్కటం కోసమే ఆరేళ్ల క్రితం ఈయూ నుంచి బ్రిటన్ బయటికొచ్చింది. బ్రెగ్జిట్ రిఫరెండమ్‌లో దీన్ని నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ ప్రజానీకం తిరస్కరించారు. కానీ వారి అభీష్టానికి విలువ లేకుండాపోయింది. ఇప్పుడు బ్రిటన్‌నుంచి విడిపోవటంతోపాటు ఈయూలో చేరటం కూడా ఈ ముగ్గురు అధినేతల ఎజెండా. చారిత్రకంగా మన రాష్ట్రాల కన్నా వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ భిన్నమైనవి. వేల్స్‌ను 13వ శతాబ్దంలో ఇంగ్లండ్ ఆక్రమించుకుంది. రాచరికాలు చుట్టరికం కలుపుకోవటంతో స్కాట్లాండ్,ఇంగ్లండ్ కలిసి ప్రయాణించి వందేళ్ల తర్వాత కలిసి 1703లో గ్రేట్ బ్రిటన్‌గా ఏర్పడ్డాయి. 1801లో దానిలో చేరిన ఐర్లాండ్ 1921లో విడిపోయింది. కానీ ఉత్తర ప్రాంతంలోని ఆరు కౌంటీలు యూకేలోనే కొనసాగుతామన్నాయి. బ్రిటన్ తప్పుడు నిర్ణయాలతో అన్ని ప్రాంతాలనూ భ్రష్టు పట్టించటంతోపాటు, వాటి అధికారాలను కుదిస్తూవచ్చింది. పన్నుల ఆదాయాన్ని సరిగా పంచక 90 దశకం చివర్లో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తి హోదాకు ముప్పు తెస్తోందన్నది వాటి అభిప్రాయం. నిరుద్యోగం, జనాభా క్షీణతపై తమకు సరైన నిర్ణయాధికారాలు లేవని వాటి ఫిర్యాదు. సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడైనా సక్రమంగా వ్యవహరించటం చేతకాకపోతే అవి మరింత ముదురుతాయి. ఫెడరల్ వ్యవస్థను నీరుగార్చి ప్రశాంతంగా మనుగడ సాగించా లనుకోవటం చెల్లదని బ్రిటన్ పాలకులు గుర్తించకపోతే... ఇప్పటికి కేవలం రాజకీయ హెచ్చరికగానే తలెత్తిన ఈ నిరసన ఆ ప్రాంత జనాభాను తాకడానికి ఎన్నాళ్లో పట్టదు. అప్పుడు బ్రిటన్ లండన్‌గా మిగిలిపోక తప్పదు. చేసిన పాపాలు శాపాలై వెంటాడ తాయంటారు. మనతో సహా అనేక దేశాలను పీల్చిపిప్పిచేసిన బ్రిటన్ ఇప్పుడు ఇల్లు చక్కదిద్దుకోగలదా అన్నది వేచిచూడాలి.

# ‘నూరుశాతం’ తప్పుడు చర్య



తీసుకునే నిర్ణయాలన్నీ వికటిస్తున్న వైనం కనబడుతూనే ఉన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తత్వం బోధపడలేదు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధాన్ని నిలువరించే పేరిట ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధించటానికీ... దాన్నుంచి ముడి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తూ ఆర్థికంగా తోడ్పడుతున్న భారత్, చైనాలపై వంద శాతం సుంకాలు విధించటానికీ అనుమతించే బిల్లును ఆయన ప్రభుత్వం ప్రతినిధుల సభలో ఆమోదింపజేసుకుంది. గత నెల ఇదే బిల్లుకు సెనేట్ ఓకే చెప్పింది. తాజా ఆమోదంతో ఈ ఆంక్షల బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ అంగీకారం తెలిపినట్టయింది. దీనిపై ట్రంప్ సంతకం చేశాక చట్టంగా మారుతుంది. ఆ అధికారాన్ని ట్రంప్ వినియోగిస్తారా లేదా అన్నది చూడాల్సివుంది. రెండోసారి అధికారంలోకొచ్చాక రష్యాపై ట్రంప్ విధించ దల్చుకున్న ఈ ఆంక్షలు అత్యంత కీలకమైనవి. ఈసారి ఆంక్షలన్నీ రష్యా ఇంధన, రక్షణ రంగాలే లక్ష్యంగా రూపొందించారు. తన అభీష్టానికి విరుద్ధంగా ఇరుగు పొరుగు దేశాలు నిర్ణయాలు తీసుకుంటే వాటితో ద్వైపాక్షిక వాణిజ్యంతోసహా వివిధ బంధాలన్నిటినీ తెంచుకోవటం ఏ ప్రభుత్వమైనా చేసే పని. కానీ ‘తన చావు జగత్ప్రళయమ’న్న రీతిలో ఆ పనే అందరూ చేసితీరాలనే డిమాండ్ మూర్ఖత్వం. అంతర్జాతీయంగా 80 ఏళ్ల క్రితం కుదిరిన ఒడంబడిక ప్రకారం దురాక్రమణ యుద్ధాలకు పాల్పడే దేశంపై ఎలాంటి చర్యలు అవసరమో ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి నిర్ణయిస్తాయి. రష్యా తప్పు చేస్తున్నదని అమెరికా భావిస్తే ఆ వేదికలద్వారా ఒత్తిళ్లు తీసుకురావాలి. అలా చేయలేననుకుంటే తనవరకూ ఇష్టానుసారం చేసుకోవచ్చు. అసలు ట్రంప్ అత్యుత్సాహంతో అమలు చేస్తున్న సుంకాల విధానంపై అమెరికాలోనే ఏకాభిప్రాయం లేదు. రష్యాపై కఠిన చర్యల్ని సమర్థిస్తున్న డెమోక్రాట్లు సైతం ట్రంప్‌కు అతిగా అధికారాలు కట్టబెట్టడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఏకపక్ష అధికారాలు అప్పగిస్తే దేశ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు. మన దేశం గతంకన్నా దృఢంగా వ్యవహరించటం హర్షించదగ్గది. ప్రస్తుత విధానాన్ని విడనాడబోమనీ, మార్కెట్ చలనాలను నిర్దేశించే ధరవరలు, సరఫరా, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భిన్న మార్గాల్లో చమురు కొనుగోలు చేయడం కొనసాగిస్తామనీ స్పష్టంచేసింది. వంద శాతం సుంకాలపై అమెరికా చర్యకు దిగితే ద్వైపాక్షిక సంబంధాలపై వాటి ప్రభావం పడుతుందని ఇప్పటికే అమెరికాకు తెలియ జేశామని తెలిపింది. అసలు ఈ తీర్మానం చేసే నైతిక హక్కు అమెరికన్ కాంగ్రెస్‌కు ఉందా? ఈ ఆంక్షలు ఒక్కరోజు ఆలస్యమైనా ఉక్రెయిన్‌లో మరింతమంది ప్రజలు మృత్యువుకు బలి అవుతారని తీర్మానం చెప్పడం వంచన. ఈ సూత్రం తనకు వర్తించదా? ఇరాన్‌పై ఇజ్రాయెల్ సాగించిన దురాగతాలను నిలువరించకపోగా, తానూ అందులో పాలుపంచుకుని దేశాధినేతతోసహా అనేకమంది పౌర, సైనిక ముఖ్యుల్ని హతమార్చటం... ఇప్పటికీ పౌర ప్రాంతాలపై బాంబులేస్తూ పదులకొద్దీ మందిని నిత్యం హతమార్చటాన్ని కాంగ్రెస్ ఎలా చూస్తుంది? తీర్మానం చేసేముందు తమ పాలకుడి నిర్వాక మేమిటన్న స్పృహ ఉండొద్దా? తాము అధర్మయుద్ధం కొనసాగిస్తూ ధర్మపన్నాలు వల్లించటం, వేరొకరిని వేలెత్తిచూపటం, అందరూ తననే అనుసరించాలనటం ఏం సబబు? వచ్చేవారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అమెరికా సందర్శనకు రాబోతున్నారు. ఇరు దేశాలమధ్యా శిఖరాగ్ర సమావేశం జరగబోతోంది. ఇలాంటి సమయంలో ఆంక్షల తీర్మానం తీసుకురావటం, బెదిరింపులకు దిగటం తెలివిమాలిన చర్యగా అమెరికా గుర్తించకపోవటం ఆశ్చర్యకరం. ఇప్పటికే ఏఐ విషయంలో సమష్టిగా కదలాలన్న అమెరికా ప్రతిపాదనను చైనా తోసిపుచ్చింది. ఆ విషయంలో ఇరు దేశాలమధ్యా భిన్నాభిప్రాయాలున్నాయని బయటపడింది. ఈ నేపథ్యంలో మరో వివాదాన్ని రగల్చటం వల్ల ఒరిగేదేమిటి? తన పెత్తందారీ పోకడలతో విసిగిన ప్రపంచం ఇప్పటికే దూరం జరిగిందని అమెరికా గ్రహించటం లేదు. ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడటంలో తెరవెనక తాను నడిపించిన ఎత్తుగడలే కారణమని గుర్తులేదా? అంతర్జాతీయ వేదికల ప్రమేయం లేకుండా ప్రపంచ దేశాలపై ఒత్తిడి తేవటం చట్టవిరుద్ధమని అమెరికా తెలుసుకోవాలి.

# అన్ని కార్యాలయాల్లో పి.జి.ఆర్.ఎస్ నిర్వహించాలి

## పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100

## టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చు

## క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చు



గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 20 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను సోమవారం జిల్లా, మండల స్థాయిలో అన్ని కార్యాలయాల్లో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. మీ కోసం వెబ్ సైట్ లోను ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. ప్రజలు నేరుగా సోమవారం నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు సమర్పించవచ్చని లేదా మీ కోసం వెబ్ సైట్ Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చని చెప్పారు.

# సిటీ ఎకనామిక్ రీజియన్ నమూనాలో సమగ్ర అభివృద్ధి




గుంటూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 20: అమరావతి రాజధాని పరిధిలోని మంగళగిరి ఐటీ పార్క్, ఎయిమ్స్‌తో పాటు గుంటూరు, తెనాలి మున్సిపాలిటీలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను అనుసంధానిస్తూ సిటీ ఎకనామిక్ రీజియన్ నమూనాలో సమగ్ర అభివృద్ధి సాధించాలని సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అమరావతి ఆర్థిక ప్రాంత మాస్టర్ ప్లాన్, జిల్లా ఆర్థికాభివృద్ధి ప్రణాళికపై జిల్లా అధికారులు, సాంకేతిక భాగస్వాముల ప్రతినిధులతో ప్రత్యేక కార్యశాలను నిర్వహించారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధికి ఉన్న అవకాశాలు, అభివృద్ధి చెందుతున్న రంగాలు, సేవా రంగాల ప్రాధాన్యతపై చర్చించారు. మిర్చి, పసుపు వంటి పంటలను ముడి ఉత్పత్తులుగా ఎగుమతి చేయడం మాత్రమే కాకుండా స్థానికంగా ఆహార శుద్ధి, నాణ్యత విభజన, విలువ జోడింపు పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. కృష్ణా నదీ తీర ప్రాంతాన్ని వినియోగించుకుని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు పొందేందుకు పటిష్టమైన ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల విజయవాడలో జరగనున్న ప్రాంతీయ సదస్సును దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యశాలలో ముఖ్య ప్రణాళిక అధికారి పి. శేషశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి. సత్యనారాయణ చౌదరి, సాంకేతిక భాగస్వాముల ప్రతినిధులు పాల్గొన్నారు.




# పి.జి.ఆర్.ఎస్‌పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి




నరసరావుపేట, మహి న్యూస్ సెప్టెంబర్ 20: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా సేవలు పొందిన ప్రజలు తమ అభిప్రాయాలను క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల పిలుపునిచ్చారు. పి.జి.ఆర్.ఎస్‌ను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడంతో పాటు ప్రజల సంతృప్తిని మెరుగుపరచేందుకు ప్రభుత్వం నిరంతరం అభిప్రాయాలను సేకరిస్తోందని తెలిపారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నోటీసు బోర్డులు, సహాయక కేంద్రాలు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద కూడా క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని సూచించారు. పి.జి.ఆర్.ఎస్ సేవలు పొందిన వెంటనే ప్రజలు తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్‌కు చేరుతుందని పేర్కొన్నారు. అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో నిర్వహించే పి.జి.ఆర్.ఎస్‌లో ప్రజలు తమ అర్జీలు సమర్పించి, సేవలపై తమ స్పందనను క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని కలెక్టర్ కోరారు.

# కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ఈనెల 21వ తేదీన నిర్వహణ




ఒంగోలు, మహి న్యూస్, సెప్టెంబర్ 20 : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ Meekosam.ap.gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం లి"సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్"లిను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు చేసిన ఫిర్యాదుల పరిష్కారంపై వారి అభిప్రాయాలను నేరుగా సేకరించి, పరిష్కార నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ను ఫిర్యాదుదారులు స్కాన్ చేసి తమ సమస్య పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ నమోదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణతో పాటు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందడంతో పాటు, సమస్య పరిష్కారమైన అనంతరం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను నమోదు చేసి ప్రజా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన వారసత్వ సంపద

## స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం

కాకినాడ రూరల్, మహి న్యూస్, సెప్టెంబర్ 20:- దేశ స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన భారతీయుల వారసత్వ సంపద అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో 'భారతీయం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ... "ఒక తండ్రి తన జీవితాంతం కష్టపడి ఇల్లు, పొలం, డబ్బు, బంగారం, ఆస్తులు సంపాదిస్తాడు. తాను వాటిని తనతో తీసుకెళ్లలేనని తెలిసినా, తన పిల్లలు వాటిని సద్వినియోగం చేసుకుని తనకంటే గొప్ప స్థాయికి ఎదగాలని కోరుకుంటాడు. అదే సమయంలో, ఆ సంపద వెనుక ఉన్న తన కష్టం, శ్రమ, విలువలు పిల్లలకు తెలియాలని కూడా కోరుకుంటాడు. లేదంటే తాము సంపాదించినదంతా కోల్పోయి, పిల్లలు తిరిగి మొదటి స్థితికి చేరుకుంటారని భయపడతాడు. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామం కూడా అలాంటిదే. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అందించారు. ఆ సంపదను అనుభవించడం మాత్రమే కాదు... దాని విలువను తెలుసుకుని, కాపాడుకోవడం మన బాధ్యత. మన వంశం గురించి మనం తెలుసుకున్నట్లే, మన దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల గురించి కూడా తెలుసుకోవాలి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ జీవించాలి. దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం కాదు. "నేను భారతీయుడిని" అని గర్వంగా చెప్పుకోగలిగే స్వేచ్ఛ వెనుక ఎందరో చేసిన త్యాగాలను గుర్తుంచుకోవడం అని తెలిపారు.

### స్వాతంత్ర్య సమయంలో పుట్టిన పదం భారతీయం

"భారతీయం అనే మాట ఇప్పుడు పుట్టింది కాదు. భారతదేశం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో పుట్టిన మాట భారతీయం. సైమన్ కమిషన్ వచ్చినప్పుడు "భారతదేశం గురించి నిర్ణయాలు భారతీయులే తీసుకోవాలి" అంటూ దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. "సైమన్ గో బ్యాక్" అంటూ నల్లజెండాలతో ప్రజలు ఉద్యమించారు. ఎందరో జైళ్లకు వెళ్లారు. "భారతీయం లేని సైమన్ మాకు వద్దు" అని నిరసనలు తెలిపారు. అప్పుడు పుట్టిందే "భారతీయం". భారతీయం గురించి ఎప్పుడూ చర్చిస్తూ ఉండాలి. అప్పుడే పిల్లలకు స్వాతంత్ర్యం గురించి తెలుసుకొని దేశభక్తి పొంది ఉంటారు. లేదంటే దేశభక్తి, నైతిక విలువలు నశించిపోతాయి" అని అన్నారు.

### త్యాగాల స్ఫూర్తితో దేశభక్తి భావనను పెంపొందిద్దాం

"అండమాన్‌లోని కాలాపానీ జైలు గురించి చదివితే స్వాతంత్ర్య సమర యోధులు అనుభవించిన కష్టాలు మనసును కదిలిస్తాయి. ఇరుకైన గదులు, ఒంటరితనం, శారీరక హింస... అయినా వారి సంకల్పం మాత్రం చెదరలేదు. గాంధీజీ, నెహ్రూ, లాలా లజపతిరాయ్, టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు వంటి అనేకమంది మహనీయుల జీవితాలను చదివితే స్వాతంత్ర్యం ఎంతటి త్యాగాల ఫలితమో అర్థమవుతుంది. టంగుటూరి ప్రకాశం పంతులు బ్రిటిష్ పోలీసుల తుపాకీకి ఎదురు నిలిచి చూపిన ధైర్యం కారణంగానే ఆయనకు "ఆంధ్రకేసరి" అనే బిరుదు వచ్చింది. రైతులకు నీరు అందించాలనే ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిన ప్రకాశం బ్యారేజీ కూడా ఆయన పేరును గుర్తుచేస్తుంది. ఘంటసాల వెంకటేశ్వర రావు కేవలం గాయకుడిగా మాత్రమే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు అంతిమయాత్రలో పాల్గొని దేశభక్తి గీతాలు పాడుతూ చివరి వరకు వెంట ఉన్నారు. కళను కూడా దేశసేవకు ఉపయోగించిన మహనీయుడు ఆయన. బంకించంద్ర ఛటర్జీ రచించిన "ఆనందమఠం" వంటి రచనలు దేశభక్తి, క్రమశిక్షణ, దేశం పట్ల బాధ్యత వంటి భావాలను ప్రజల్లో బలపరిచాయి. "వందేమాతరం" కూడా అదే భావజాలానికి ప్రతీకగా నిలిచింది. మనకు దేవాలయాలు ఎంత పవిత్రమో, స్వాతంత్ర్య సమరయోధులు జీవించిన జైళ్లు, స్మారకాలు, పోరాట ప్రదేశాలు కూడా అంతే ముఖ్యమైన చారిత్రక ప్రదేశాలు. వాటిని సందర్శించినప్పుడు ఆసక్తి పెరుగుతుంది. వాటి గురించి తెలుసు కున్నప్పుడు చరిత్ర అర్థమవుతుంది. చరిత్ర అర్థమైనప్పుడు దేశభక్తి మరింత బలపడుతుంది. అందుకే పిల్లలకు పుస్తకాలు బహుమతిగా ఇవ్వండి. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను చదివించండి. అండమాన్ వంటి చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లండి. మనకు లభించిన స్వేచ్ఛ వెనుక ఉన్న త్యాగాలను వారికి తెలియజేయండి. ఎందుకంటే వారి త్యాగాలను తెలుసుకోవడమే మన వారసత్వాన్ని తెలుసుకోవడం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్వాతంత్ర్యం మనకు సాధారణంగా రాలేదు, ఎందరో త్యాగాల ఫలితంగా వచ్చింది, ఆ త్యాగాలకు మనమే వారసులమని పిల్లలకు అర్థమవుతుంది. భారతదేశం మనది. ఈ దేశాన్ని గౌరవించడం, కాపాడడం మన బాధ్యత. దేశ సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన వర్తమానానికి పునాది, మన భవిష్యత్తుకు వారసత్వ సంపద" అని పేర్కొన్నారు.

### దేశభక్తి ఉన్న లోకేష్ విద్యా శాఖ మంత్రి అవ్వడం విద్యార్థుల అదృష్టం

"పిల్లల్లో దేశభక్తి, నైతిక విలువలు, చరిత్ర పట్ల గౌరవం పెంపొందించాలనే ఉద్దేశంతో "భారతీయం" కార్యక్రమం నిర్వహించాలనే ఆలోచనను మంత్రి నారా లోకేష్ ఇంటికి వెళ్లి చెప్పగానే, ఆయన వెంటనే స్పందించి కార్యక్రమానికి వస్తానని చెప్పారు. ఆయనతో మాట్లాడి తిరిగి వెళుతుంటే నా కారు వద్దకు వచ్చి పెద్దాయన జాగ్రత్త అని నా కారు డ్రైవర్‌కు చెప్పి మరీ వెళ్లారు. కార్యక్రమం మొదలు సమయాన్ని చెప్పిన దానికంటే ముందుగానే వచ్చి కార్యక్రమంలో పాల్గొనడం ఆయన దేశం, చరిత్ర పట్ల చూపిన ఆసక్తికి నిదర్శనం. ఇటువంటి దేశభక్తి ఉన్న లోకేష్ వంటి నాయకుడు రాష్ట్ర విద్యామంత్రి కావడం విద్యార్థుల అదృష్టం" అని మంత్రి లోకేష్‌ను అభినందించారు చాగంటి కోటేశ్వరరావు.

# సుంకరపాలెంలో శ్రీ లక్ష్మీ గణపతికి 36 కేజీల భారీ లడ్డు సమర్పణ

## భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న 12వ గణపతి నవరాత్రి మహోత్సవాలు.

తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 20: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం బైపాస్ ప్రధాన కూడలిలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో 12వ గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీ లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు,





నైవేద్య కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల గణపతి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా శ్రీ విజయ ఆటోమొబైల్స్ అధినేత ఉండు మాణిక్యం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక స్వామివారికి 36 కేజీల భారీ లడ్డును నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేకంగా తయారు చేసిన భారీ లడ్డును స్వామివారి సన్నిధికి తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. భారీ లడ్డును చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. స్వామివారికి సమర్పించిన లడ్డును భక్తులు దర్శించుకుని గణపతి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ, వర్తక సంఘం ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి 36 కేజీల భారీ లడ్డును నైవేద్యంగా సమర్పించిన ఉండు మాణిక్యాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందించారు. భక్తి భావంతో స్వామివారికి భారీ లడ్డును సమర్పించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, శ్రీ లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం సభ్యులు, శ్రీ విజయ ఆటోమొబైల్స్ సిబ్బంది, స్థానికులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణపతి నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మరిన్ని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# విద్యార్థుల్లో స్ఫూర్తినింపిన భారతీయం

కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 20: కాకినాడ జిల్లా తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందించారు. సత్సంగంలో మంత్రి నారా లోకేష్‌కు చాగంటి కోటేశ్వరరావు వేద ఆశీర్వచనం అందించారు. కంచి కామకోటి పీఠం 68వ పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి (కంచి పరమాచార్య) రచించిన 'దేవుని స్వరం' పుస్తకాలను ఈ సందర్భంగా లోకేష్ కు బహుకరించారు. అనంతరం సత్సంగం సభ్యులతో మంత్రి ముచ్చటించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతతో పాటు దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించే కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

### వినూత్నంగా భారతమాతకు హారతులు

కార్యక్రమంలో భారతమాతకు 108 మంత్రాలతో పుష్పాంజలి సమర్పించారు. భారతీయతను ప్రతిబింబించే శబ్దాలను, స్వరాలను మేళవించి 'వందేమాతరం' గీతాలాపనతో వినూత్నంగా భారతమాతకు హారతులు ఇచ్చారు.

### సైనిక సేవలను విద్యార్థులతో పంచుకున్న మాజీ సైనికుడు

కార్యక్రమంలో మాజీ సైనికుడు డా. కిరణ్ కుమార్ భారత సైన్యంలో తాను అందించిన సేవలు, తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశ రక్షణ కోసం ఆయన అందించిన సేవలను అభినందిస్తూ మంత్రి డా. కిరణ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ మెమెంటోలు అందజేసి సత్కరించారు. భారతీయ సంస్కృతి, దేశభక్తి, సేవాభావం, సైనికుల త్యాగాల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా 'భారతీయం' కార్యక్రమం కొనసాగింది.

# ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం...



తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 20.: తాళ్లరేవు మండలంలోనీ సుంకరపాలెం గ్రామంలోని పురాతన శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి ఆలయంలో 75వ గణపతి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యుల పర్యవేక్షణలో శ్రీ లక్ష్మీ గణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కోణంబట్ల సత్తిబాబు శర్మ బ్రహ్మత్వంలో హోమ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పలు రకాల పళ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గరిక పూజ చేసి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ గణపతి హోమం భక్తిశ్రద్ధలతో సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హోమ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమంలో పాల్గొంటే విఘ్నాలు తొలగి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలుగుతాయని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. కార్యక్రమంలో నరహరిశెట్టి వీరబాబు, పెద్దిరెడ్డి విఘ్నేశ్వర రావు, నందికొల్ల సత్తిబాబు, మాగాపు శ్రీనివాసరావు, పడాల సత్తిబాబు, నరహరిశెట్టి గణేష్, నరహరిశెట్టి శ్రీను వాసు, మాగాపు చంద్రశేఖర్, పేరా బత్తుల సుబ్రహ్మణ్యేశ్వర రావు, మాకిరెడ్డి సత్తిబాబు, నందికొల్ల వీరబాబు,మాగాపు లోవరాజు, కొప్పిశెట్టి బుజ్జి, పెద్దిరెడ్డి శివన్నారాయణ, కంద సతీష్, మొపూరి మన్నేశ్వరరావు,నందికొల్ల సతీష్, అశోక్,ప్రసాద్, గోపి, చిన్ని, మధు, శివ, సతీష్, నాని,వినోద్, వెంకన్న బాబు,ప్రవీణ్, సాయి,సంతోష్, దయ,సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



# ఘనంగా 75వ గణపతి నవరాత్రులు

## చిన్నారుల నృత్య, ఆటల పోటీలు.



తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 20: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలోని పురాతన శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి ఆలయంలో 75వ గణపతి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు నృత్య పోటీలు, ఆటల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులు తమ నృత్య ప్రతిభను ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. వివిధ ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. చిన్నారుల ప్రదర్శనలు, ఆటపాటలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో స్థానికులు తరలివచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు భక్తి, సాంస్కృతిక సంప్రదాయాల పట్ల ఆసక్తి పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు.



# వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన సేవకు ఏడాది..

## ముఖ్య కార్యదర్శికి ఘన సన్మానం.



యానాం, మహి న్యూస్, సెప్టెంబర్ 20: కేంద్రపాలిత ప్రాంతమైన యానంలో రెడ్డి రాజుల కాలం నాటి పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏడాది కాలంగా ఆలయంలో భక్తులకు అన్నదాన సేవను కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ముఖ్య కార్యదర్శి పెద్దింటి రఘురాం వినోద్‌ను ఆలయ నిర్వాహకులు, భక్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. భక్తులకు నిరంతరం అన్నదాన సేవ అందించడం అభినందనీయమని, సేవా కార్యక్రమాన్ని ఏడాది పాటు విజయవంతంగా కొనసాగించడం విశేషమని పేర్కొన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక సేవతో పాటు అన్నదానం ద్వారా సేవ చేయడం పుణ్యకార్యమని తెలిపారు.

## తిమ్మోజి పల్లి గ్రామంలో వినాయక నిమజ్జన కార్యక్రమం

### కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రకాష్ రెడ్డి తదితర గ్రామస్తులు.



చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం సెప్టెంబర్ 20.: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలో గల తిమ్మోజి పల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏడు రోజులపాటు గ్రామంలో గ్రామస్తులు వినాయకునికి పూజలు చేసి నడివీధిలో వినాయకుని ప్రతిష్టింప చేశారు. ఆదివారం నిమజ్జనా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రకాష్ రెడ్డి తో పాటు గ్రామస్తులు మహిళలు, యువత పాల్గొని ఆదివారం వినాయకునికి ప్రతి ఇంటి వారు పూజలు చేశారు. బ్యాండు వాయిద్యాల నడుమ గ్రామస్తులు కలర్స్ పూసుకొని డాన్సులు వేస్తూ వినాయకుని నిమజ్జనం కోసం తిమ్మోజిపల్లి నుండి ముంగరమడుగు చెరువు దగ్గరికి తీసుకెళ్లి వినాయకుడిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రకాష్ రెడ్డి, తనయుడు భగత్ రెడ్డి, బాలాజీ రెడ్డి, సంరై, కిరణ్, భరత్ కుమార్, మంజు తదితర గ్రామస్తులు యువత మహిళలు పాల్గొన్నారు

## కుప్పం రైల్వే స్టేషన్‌లో అదనపు రైళ్లకు నిలుపుదల

కుప్పం, సెప్టెంబరు 20 (మహి న్యూస్): కుప్పం నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం కుప్పం రైల్వే స్టేషన్‌లో మరిన్ని రైళ్లకు అదనపు నిలుపుదల కల్పిస్తూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో కుప్పం రైల్వే స్టేషన్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు నిలుపుదల కల్పించేందుకు నిర్ణయం వెలువడింది.

ప్రయోగాత్మక ప్రాతిపదికన ఈ అదనపు నిలుపుదలలు తదుపరి ఆదేశాలు వెలువడే వరకు అమల్లో ఉంటాయి.

### 1. రైలు నెం. 17315 వాస్కోడ గామా--వేళాంకన్నీ వీక్లీ ఎక్స్‌ప్రెస్:

2026 సెప్టెంబరు 21న వాస్కోడ గామా నుంచి బయలుదేరే ప్రయాణం నుంచి కుప్పం రైల్వే స్టేషన్‌కు రాత్రి 00:33 గంటలకు చేరుకుని, 00:35 గంటలకు బయలుదేరుతుంది.

### 2. రైలు నెం. 17316 వేళాంకన్నీ--వాస్కోడ గామా వీక్లీ ఎక్స్‌ప్రెస్:

2026 సెప్టెంబరు 22న వేళాంకన్నీ నుంచి బయలుదేరే ప్రయాణం నుంచి కుప్పం రైల్వే స్టేషన్‌కు ఉదయం 09:33 గంటలకు చేరుకుని, 09:35 గంటలకు బయలుదేరుతుంది.

### 3. రైలు నెం. 11005 దాదర్--పుదుచ్చేరి త్రై-వీక్లీ ఎక్స్‌ప్రెస్:

2026 సెప్టెంబరు 20న దాదర్ నుంచి బయలుదేరే ప్రయాణం నుంచి కుప్పం రైల్వే స్టేషన్‌కు రాత్రి 22:45 గంటలకు చేరుకుని, 22:47 గంటలకు బయలుదేరుతుంది.

### 4. రైలు నెం. 11006 పుదుచ్చేరి--దాదర్ త్రై-వీక్లీ ఎక్స్‌ప్రెస్:

2026 సెప్టెంబరు 22న పుదుచ్చేరి నుంచి బయలుదేరే ప్రయాణం నుంచి కుప్పం రైల్వే స్టేషన్‌కు తెల్లవారుజామున 03:28 గంటలకు చేరుకుని, 03:30 గంటలకు బయలుదేరుతుంది. కుప్పం రైల్వే స్టేషన్‌లో అదనపు రైళ్లకు నిలుపుదల కల్పించడం ద్వారా కుప్పం నియోజకవర్గ ప్రజలకు, ప్రయాణికులకు మరింత మెరుగైన రైలు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ నిర్ణయం పట్ల కుప్పం నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఈ నెల 21 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ



తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 20 : ఈ నెల 21 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. – అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు అలాగే పిజిఆర్ఎస్ పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయాలన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21 వ తేదీన సోమవారం తిరుపతి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కనకాలపేటలో శ్రీ లక్ష్మీ గణపతికి 108 కేజీల మహా లడ్డు సమర్పణ



యానం,మహి న్యూస్, సెప్టెంబర్ 20: యానాం శివారు కనకాలపేట గణపతినగర్‌లో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి గ్రామస్తులు కనకాల వెంకట్రావు, శిరీష దంపతులు, వారి కుమారుడు వీర వెంకట సతీష్ కుమార్, లక్ష్మీ



సుప్రియ దంపతులు 108 కేజీల భారీ లడ్డూను ప్రసాదంగా సమర్పించారు. ముందుగా ఆలయ అర్చకులు కోణంభట్ల శ్రీరామచంద్రమూర్తి, సాయి సతీష్ శర్మల బ్రహ్మత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో 108 కేజీల మహా లడ్డూను శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. భారీ లడ్డూను స్వామివారికి సమర్పించడంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు భక్తిపారవశ్యంతో గణపతి నామస్మరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కవల గణపతరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు లడ్డూ ప్రసాదాన్ని సమర్పించిన కనకాల వెంకట్రావు, శిరీష దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు. స్వామివారి ఆశీస్సులు కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# జయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి



కుప్పం, సెప్టెంబర్ 20 (మహి న్యూస్): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 21వ తేదీ నుండి 22వ తేదీ వరకు కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పర్యటించనున్న నేపథ్యంలో, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజాన్ (ఏఎస్-ఎల్)లో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఐపీఎస్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం నాయుడు, ముఖ్యమంత్రి పర్యటన లైజన్ ఆఫీసర్ పి. వెంకటేష్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, కుప్పం రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌తో కలిసి ఆదివారం పర్యటనకు సంబంధించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా తుంసి హెలిప్యాడ్, శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి చేరుకుని అక్కడ హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ జలహారతి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కుప్పం నియోజకవర్గంలో రైతు బజార్ శంకుస్థాపన స్థలాన్ని, కుప్పం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ ప్రాంతాలను తనిఖీ చేశారు. రూ. 289.5 కోట్ల విలువైన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు రూ. 38.5 కోట్ల విలువైన పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా "స్వర్ణ కుప్పం" విజయాలను ప్రదర్శించే వీడియోను సీఎం వీక్షిస్తారు, లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారు, అలాగే కుప్పం కొత్తపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం "స్వర్ణ కుప్పం" అచీవ్‌మెంట్స్ గ్యాలరీని సందర్శించి, హిందాల్కో ప్రతినిధులతో సమావేశమవుతారు. జాతీయ రహదారి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పం రైల్వే స్టేషన్‌లో అదనపు హాల్ట్ కేటాయించిన స్థలాన్ని, అలాగే కడపల్లి నందు ముఖ్యమంత్రి పాల్గొనే కేడర్ మీటింగ్ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలహారతి, బహిరంగ సభ, ముఖ్యమంత్రి పర్యటించే ప్రధాన ప్రాంతాలలో పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, రైల్వే స్టేషన్ ప్రాంగణంలో భద్రతా చర్యలు ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుషార్ దూడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అత్యున్నత ప్రమాణాలతో భద్రతా ఏర్పాట్లు అమలు చేయడంతో పాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భద్రతా విభాగం జారీ చేసే సూచనలను ప్రతి శాఖ తప్పనిసరిగా పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీకేఎం యూడీఏ చైర్మన్ సురేష్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, బెంగళూరు జోన్‌కు చెందిన రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ సమక్షంలో మోదీ మిమిక్రీ.. రగిలిపోతున్న బీజేపీ!

భోపాల్ : పేపర్ లీకేజీలతో పాటు ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు అండగా నిలిచేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం రాజకీయ దుమారానికి దారితీసింది. మధ్యప్రదేశ్ ఇండోర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టాండప్ కమెడియన్ పుల్కిత్ మణి ప్రధాని నరేంద్ర మోదీని అనుకరిస్తూ మిమిక్రీ చేయడంపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై కేంద్ర మంత్రులు సహా పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్ పార్టీ తీరును తీవ్రంగా ఖండించారు.కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీ కమెడియన్లు, జోకర్ల పార్టీగా మారిపోయిందని, వారు శాశ్వతంగా రాజకీయాల నుంచి కనుమరుగయ్యారని ఆర్ఐపీ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నైతిక దివాలాకోరుతనానికి అట్టడుగు స్థాయికి దిగజారాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ధ్వజమెత్తారు. విద్యార్థుల సంభాషణ వేదికను ఉపయోగించుకుని ప్రధానిని అపహాస్యం చేయడం వారిలో మానవతా దృక్పథం లోపించడాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు. బీజేపీ నాయకుడు సీఆర్ కేశవన్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఇలాంటి వ్యక్తులతో వేదికను పంచుకోవడమే కాక, ఆ వ్యాఖ్యలకు నవ్వుతూ మద్దతు తెలిపారని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చవకబారు సంస్కృతిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. ఈ వివాదానికి కారణం ఏమిటి?ఇండోర్‌లో విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో స్టాండప్ కమెడియన్ పుల్కిత్ మణి రాహుల్ గాంధీతో కలిసి వేదికను పంచుకున్నారు. ఆ సమయంలో ఆయన చేసిన మిమిక్రీ ప్రదర్శన దేశ రాజకీయాల్లో పెద్ద దుమారాన్ని రేపింది. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రభుత్వంపై, ముఖ్యంగా పేపర్ లీక్‌లు, నిరుద్యోగం, విద్యా వ్యవస్థలోని లోపాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థులు విద్యా వ్యవస్థపై కోల్పోయిన నమ్మకాన్ని తిరిగి తీసుకురావడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. అయితే, ఇదే వేదికపై కమెడియన్ పుల్కిత్ మణి చేసిన ప్రదర్శన ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారిన పుల్కిత్ మణి ఒక ప్రొఫెషనల్ స్టాండప్ కమెడియన్.ఆయన 2021 నుంచి ప్రొఫెషనల్‌గా స్టాండప్ కామెడీ ప్రదర్శనలు ఇస్తున్నారు. లైవ్ షోలు, కామెడీ క్లిప్‌లు, ప్రముఖుల మిమిక్రీ , పొలిటికల్ సెటైర్లతో సోషల్ మీడియాలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయనకు లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్నారు. ప్రస్తుత కాలంలో యువతను ఆకట్టుకునేలా సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలపై కామెడీ స్కిట్‌లు చేయడం ఆయన శైలి.

## వాతావరణ శాఖ హెచ్చరిక.. 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్

అమరావతి: వాతావరణ శాఖ రాష్ట్రానికి వర్ష హెచ్చరికలు జారీ చేసింది. వర్షాల నేపథ్యంలో 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మన్యం, విజయనగరం, అల్లూరి, పోలవరం జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. వాటితో పాటు అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

## ఇదీ కూటమి ప్రభుత్వ తీరు..: బొత్స సత్యనారాయణ

విజయనగరం జిల్లా: కూటమి నేతలు దోపిడీకి అలవాటు పడ్డారని మాజీ మంత్రి, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. గజపతినగరం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో బొత్స సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. "40 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నాం. రాజకీయాల్లో వస్తూ ఉంటారు... పోతూ ఉంటారు. ఒకరు పోతే వంద మంది వస్తారు. ఇప్పుడు కూటమి నేతల తీరు చూస్తూ ఉంటే బీపీ పెరిగి పోతుంది. కూటమి నేతలు దోపిడీకి అలవాటు పడ్డారు. అలీబాబా 40 దొంగలు తీరులా వీళ్లంతా ఒకటయ్యారు. సెటిల్‌మెంట్లు అన్నీ పోలిస్ స్టేషన్లల్లో, ఎండీవో ఆఫీసుల్లో జరుగుతున్నాయి. ఇదీ కూటమి ప్రభుత్వ తీరు. మీ వెంటే... అప్పలనర్సయ్య తో పాటుగా నేను. మా పిల్లలు ఉంటారు. పార్టీ బోలేపేతానికి కృషి చెయ్యండి" అని అన్నారు. కాగా, గజపతినగరం నియోజకవర్గంలో బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బొత్స సత్యనారాయణతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, పెనుమత్స సురేష్ బాబు, పార్లమెంటు ఇన్‌చార్జ్ సత్యనారాయణ, గజపతినగరం నియోజకవర్గం ఇన్‌చార్జి జగన్ మోహన్ రావు హాజరయ్యారు.

## ఏడు కెమెరాలు, ఏడుగురు డైరెక్టర్లతో.. బాబు డ్రామా పీక్స్: కేకే రాజు ఫైర్



విశాఖపట్నం: ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆరోపించారు. ఇళ్ల క్రమబద్ధీకరణ విషయంలో చంద్రబాబు మాత్రమే ఈ కార్యక్రమం చేపట్టినట్లుగా మాట్లాడటం సరికాదన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో భారీ ఈవెంట్ నిర్వహించారని, ఏడు కెమెరాలు, ఏడుగురు డైరెక్టర్లతో కార్యక్రమాన్ని షోగా మార్చారని విమర్శించారు. పేదల ఇళ్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఎప్పటినుంచో కొనసాగుతోందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం పలు జీవోలు జారీ చేశామని ఆయన తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదల కోసం 39, 40, 41, 42 జీవోల ద్వారా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ హయాంలో చేపట్టిన 'జగనన్న సంపూర్ణ గృహ హక్కు' కార్యక్రమం ద్వారా పేదలకు ఇళ్లపై హక్కులు కల్పించామని అన్నారు. 100 గజాల్లోపు ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఉచితంగా హక్కులు కల్పించినట్లు తెలిపారు. 100 నుంచి 200 గజాల ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వ ధరలో 50 శాతం రాయితీతో సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 లక్షల మందికి ఇళ్లపై హక్కులు కల్పించినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సిద్ధమైన పట్టాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. గతంలో ఇచ్చిన పట్టాలకే మళ్లీ పట్టాలు ఇస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అలాగే ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో టీడీపీ నాయకులు లక్షలాది రూపాయలు వసూలు చేశారని కేకే రాజు ఆరోపించారు.

## అంగటి దిబ్బలో మన్యాల శ్రీనివాస్‌కు అపూర్వ స్వాగతం

### మా ప్రాంతంలో పుట్టి పెరిగిన మన్యాల శ్రీనివాస్‌కు సంపూర్ణ మద్దతు: స్థానిక ప్రజలు

విశాఖపట్నం: దక్షిణ నియోజకవర్గం పరిధిలోని పాత 29వ, నూతన 31వ వార్డు అంగటి దిబ్బ ప్రాంతంలో జనసేన సీనియర్ నాయకులు మన్యాల శ్రీనివాస్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయనను ఆత్మీయంగా కలుసుకుని ఘన స్వాగతం పలికారు. యువత, మహిళలు, పెద్దలు, జనసేన కార్యకర్తలు, అభిమానులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో పుట్టి పెరిగి చిన్ననాటి నుంచి తమ మధ్యే ఉంటూ, తమ కుటుంబాలతో సన్నిహితంగా మెలుగుతున్న మన్యాల శ్రీనివాస్‌తో తమకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ, సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. "మన ప్రాంతంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా మా కష్టాలు, అవసరాలు, సమస్యలు ఆయనకు బాగా తెలుసు. మా మధ్యే జీవించిన వ్యక్తి కావడంతో ప్రజల సమస్యలపై ఆయనకు మంచి అవగాహన ఉంది. అందుకే మన్యాల శ్రీనివాస్‌కు మా ప్రాంత ప్రజల తరపున పూర్తి మద్దతు, సహకారం అందిస్తాం" అని స్థానికులు స్పష్టం చేశారు. అనంతరం మన్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంగటి దిబ్బ ప్రాంత ప్రజలతో తనకు ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, నమ్మకం తన బాధ్యతను మరింత పెంచుతున్నాయని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పర్యటనలో భాగంగా స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడిన ఆయన తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. "మీ ప్రేమ, నమ్మకం నాకు ఎంతో విలువైనవి. అంగటి దిబ్బ ప్రాంత ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకురండి. మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, మీతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను" అని మన్యాల శ్రీనివాస్ తెలిపారు.

## భగత్‌సింగ్ జయంతి సందర్భంగా యువతకు ఆటల పోటీలు

విశాఖపట్నం, , సెప్టెంబర్ 20: షహీద్ భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని నవజవాన్ భారత్ సభ, షహీద్ భగత్‌సింగ్ లైబ్రరీ ఆధ్వర్యంలో పెదజాలారిపేట యువకులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా టగ్ ఆఫ్ వార్ పోటీని ఉత్సాహంగా నిర్వహించగా యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే యువతకు ఇలాంటి క్రీడా పోటీలు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయని నిర్వాహకులు తెలిపారు. భగత్‌సింగ్ వంటి ప్రజా నాయకుడి జయంతి సందర్భంగా యువతలో చైతన్యం పెంపొందించే కార్యక్రమాలతో పాటు ఆటల పోటీలు నిర్వహించడం అవసరమని నవజవాన్ భారత్ సభ సభ్యుడు సుజన్ అన్నారు. భగత్‌సింగ్ జయంతిని ప్రతి ఒక్కరూ పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నవ జవాన్ సభ్యులు అరుణ, అవినాష్, జయ, ఉష, మధు, ఇంద్ర తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లపై నిరంతర పోలీసు నిఘా.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు..

### – టూటౌన్ ఎస్ఐ రమేష్

విశాఖపట్నం, సెప్టెంబర్ 20: రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు ఎల్లప్పుడూ నిఘా ఉంచుతారని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ ఎస్ఐ జె. రమేష్ హెచ్చరించారు. టూటౌన్ సీఐ బి. అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఎస్ఐ రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనవసర వివాదాల్లో తలదూర్చడం, సెటిల్‌మెంట్లకు పాల్పడటం మానుకోవాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగించేలా దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రవర్తనలో మార్పు రాకపోతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆరు నెలలకోసారి బైండోవర్ చేయడం ద్వారా వారి కదలికలు, ప్రవర్తనపై పోలీసులు నిఘా కొనసాగిస్తారని చెప్పారు. బైండోవర్ కాలంలో నేరాలకు పాల్పడితే చట్టప్రకారం జరిమానా, జైలు శిక్ష వంటి చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో ఉంటే కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించడంతో పాటు సమాజంలోనూ గౌరవం, గుర్తింపు పెరుగుతాయని ఎస్ఐ రమేష్ సూచించారు. రౌడీ షీటర్లు చట్టాన్ని గౌరవిస్తూ ప్రశాంత జీవనం సాగించాలని కోరారు.

## భీమిలిలో జనసేనకు భారీ బలం

### పాతపాలెంలో 100కుపైగా కుటుంబాలు పార్టీలో చేరిక



భీమిలి నియోజకవర్గంలో జనసేన పార్టీకి ప్రజల నుంచి స్పందన పెరుగుతోంది. భీమిలి మండలం పెద్దనాగమయ్య పాలెం పంచాయతీ పరిధిలోని పాతపాలెం గ్రామంలో యువనేత సరగడ శివరామ్ రెడ్డి ఆధ్వర్యంలో 100కుపైగా కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. జనసేన విశాఖ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి, కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ పంచకర్ల నాగసందీప్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పవన్ కల్యాణ్ సేవా స్ఫూర్తి, జనసేన సిద్ధాంతాలు, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఉన్న విశ్వాసంతోనే ప్రజలు పార్టీలో చేరుతున్నారని నాయకులు తెలిపారు. భీమిలి నియోజకవర్గంలో జనసేనను మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. చేరికల అనంతరం అవంతి కళాశాల నుంచి చిప్పాడ గ్రామం వరకు యువత, జనసైనికులు, పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి నక్క శ్రీధర్ సభాధ్యక్షత వహించారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

## రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి పోలీసుల కౌన్సిలింగ్



కర్నూలు, సెప్టెంబర్ 20: (మహి న్యూస్): జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కర్నూలు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో జీవించాలని పోలీసులు సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. ఇకపై చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం పోలీసుల సూచనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.



# నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)

## ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబరు 20 :- జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు ఈ నెల 21వ తేదీ సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వినతులను పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను (Meekosam.ap.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని, అర్జీల పరిష్కార స్థితిని టోల్‌ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయిలో సమస్యలను పరిష్కరించుకోవాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి పిజిఆర్ఎస్‌లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించాలని ఆదేశించారు.

# 25వ తేదీ నుంచి నంద్యాల జిల్లా పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి




నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 20: ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం సెప్టెంబర్ 24, 2026తో ముగియనున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 25వ తేదీ నుంచి జిల్లా పరిషత్‌ల పరిపాలనను కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి (ఎన్నికలు-నియమాలు) శాఖ జి.వో.ఎం.ఎస్. నెం. 129, తేదీ: 19-09-2026 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994లోని సెక్షన్ 250-ఏ(1) కింద, నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ జి. రాజకుమారిని నంద్యాల జిల్లా పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా (స్పెషల్ ఆఫీసర్) నియమించింది. ఈ నియామకం సెప్టెంబర్ 25, 2026 నుంచి ఆరు నెలల కాలానికి లేదా ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ తదితర పదవీ బాధ్యతలు స్వీకరించే తేదీ వరకు అమల్లో ఉంటుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లా పరిషత్‌కు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందాల్సిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా పరిషత్ పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. మండల పరిషత్‌ల విషయానికి వస్తే, ప్రస్తుత మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం కూడా సెప్టెంబర్ 24తో ముగియనున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 25 నుంచి సంబంధిత మండల పరిషత్‌ల పరిపాలన కొనసాగింపునకు ప్రభుత్వం జారీ చేసే తదుపరి ఉత్తర్వుల మేరకు ప్రత్యేక అధికారుల ద్వారా పరిపాలన కొనసాగనుంది.

# పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, మహి న్యూస్, సెప్టెంబర్ 20 : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (20.09.2026) రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తుంది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారి సేవగా) జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.

# సోమవారం నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

## ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్న అధికారులు

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, సెప్టెంబర్ 20: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరు కాలేని పౌరులు 7422992299 నంబర్‌కు ఫోన్ చేయడం లేదా వాట్సాప్ సందేశం ద్వారా తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు.

# కర్నూలులో 1,500 గణేష్ విగ్రహాల నిమజ్జనం

## 2 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

## సెప్టెంబర్ 22న నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

## డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించాలి: ఎస్పీ విక్రాంత్ పాటిల్




కర్నూలు, సెప్టెంబర్ 20: (మహి న్యూస్): సెప్టెంబర్ 22న కర్నూలు నగరంలోని వినాయక్ ఘాట్, హెచ్ఎన్ఎస్ఎస్ నన్నూరు, ఉలిందకొండ ప్రాంతాల్లో సుమారు 1,500 గణేష్ విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. నిమజ్జన బందోబస్తు కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, 16 మంది డీఎస్పీలు, 85 మంది సీఐలు, ఆర్ఐలు, 150 మంది ఎస్ఐలతో పాటు మొత్తం సుమారు 2 వేల మంది పోలీసులను మోహరించనున్నట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియో కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడంతో పాటు బాంబు నిర్వీర్య బృందాలు, శునక దళాలతో విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### నిర్వాహకులకు పోలీసుల సూచనలు

గణేష్ విగ్రహాల నిర్వాహకులు సమయపాలన పాటించాలని, ఊరేగింపునకు అవసరమైన వాహనాలు, క్రేన్లను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. ఊరేగింపు వాహనాలపై చిన్నపిల్లలు ఎక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జన ఘాట్ల వద్ద ఈత రాని వారు, చిన్నపిల్లలు, మహిళలను నీటికి దూరంగా ఉంచాలని సూచించారు. విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఇతరుల మనోభావాలను గౌరవించాలని కోరారు. మద్యం సేవించి అత్యుత్సాహం ప్రదర్శించడం, అనధికారికంగా మద్యం విక్రయించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 112, డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

### సెప్టెంబర్ 22న నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

గణేష్ నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 22న ఉదయం 10 గంటల నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు కర్నూలు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు అమల్లో ఉంటుందని ఎస్పీ తెలిపారు. అత్యవసర సేవలకు చెందిన 108, అగ్నిమాపక, అంబులెన్స్, పోలీసు వాహనాలు, పోలీసుల అనుమతి పొందిన వాహనాలకు మాత్రమే నిమజ్జన మార్గాల్లో అనుమతి ఉంటుందని చెప్పారు. 1. కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజ్‌విహార్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, వినాయక్ ఘాట్, గాయత్రి ఎస్టేట్ వరకు సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తారు. 2. ఆర్టీసీ బస్టాండ్ నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు బళ్లారి చౌరస్తా, కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంక్, బిర్లా జంక్షన్, మద్దూర్ నగర్ సర్కిల్, సి. క్యాంపు మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వైపు వెళ్లాలి. 3. ఆత్మకూరు, నంద్యాల, నందికొట్కూరు, నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు సి. క్యాంపు, బిర్లాగేట్, గుత్తి పెట్రోల్ బంక్, కల్లూరు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్లాలి. 4. హైదరాబాద్, గద్వాల, అలంపూర్ వైపు నుంచి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి, సంతోష్ నగర్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలి. 5. అనంతపురం, డోన్ వైపు నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంక్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలి. నిమజ్జనం పూర్తయిన అనంతరం నిమజ్జన వాహనాలు దేవనగర్, కృష్ణనగర్, కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళ్లేలా మార్గాన్ని ఏర్పాటు చేశారు.

### డీజే వాహనాలకు ప్రత్యేక మళ్లింపు

### కేసీ కెనాల్ వైపు వెళ్లే డీజే వాహనాలు:

రాజ్‌విహార్ వైపు నుంచి వచ్చే డీజే వాహనాలను ఎన్టీఆర్ సర్కిల్/కలెక్టరేట్ సర్కిల్ వద్ద నిలిపి వెనక్కి మళ్లిస్తారు.

నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి వచ్చే డీజే వాహనాలను మద్దూర్ నగర్ మసీదు వద్ద నిలిపి వెనక్కి మళ్లిస్తారు.

చెన్నమ్మ సర్కిల్, షరీన్ నగర్, బళ్లారి చౌరస్తా వైపు నుంచి వచ్చే డీజే వాహనాలను బిర్లాగేట్ వద్ద నిలిపి వెనక్కి మళ్లిస్తారు.

హెచ్ఎన్ఎస్ కెనాల్ వైపు వెళ్లే డీజే వాహనాలు:

సి. క్యాంపు వైపు నుంచి నంద్యాల చెక్‌పోస్టు మీదుగా వచ్చే డీజే వాహనాలను నంద్యాల చెక్‌పోస్టు వద్ద నిలిపి వెనక్కి మళ్లిస్తారు.

బళ్లారి చౌరస్తా, సంతోష్ నగర్ వైపు నుంచి వచ్చే డీజే వాహనాలను కేశవ్ గ్రాండ్ హోటల్ సమీపంలో నిలిపి వెనక్కి మళ్లిస్తారు.

గుత్తి పెట్రోల్ బంక్ మీదుగా వచ్చే డీజే వాహనాలను అక్కడే నిలిపి వెనక్కి మళ్లిస్తారు.

నిమజ్జన మార్గాల్లో అధిక సంఖ్యలో ఆసుపత్రులు ఉన్నందున రోగులు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని డీజే వాహనాల నియంత్రణ, మళ్లింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. కర్నూలులో గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా ప్రజలు, మతపెద్దలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, యువత, మీడియా సహకరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# గణనాథుల నిమజ్జనానికి సర్వం సిద్ధం

## మూడు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు పూర్తి

## 15 క్రేన్లతో విగ్రహాల నిమజ్జనం

## భక్తులు అధికార యంత్రాంగానికి సహకరించాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు, సెప్టెంబర్ 20: (మహి న్యూస్): కర్నూలు నగరంలో సెప్టెంబర్ 22న నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి



అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఆదివారం ఆయన కేసీ కెనాల్ వినాయక ఘాట్, నన్నూరు టోల్‌గేట్ సమీపంలోని నిమజ్జన ప్రాంతం, ఉల్లిందకొండ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ ఘాట్‌లను పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు ప్రాంతాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ తెలిపారు. విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద 7, నన్నూరు టోల్‌గేట్ సమీపంలో 6, ఉల్లిందకొండ వద్ద 2 చొప్పున మొత్తం 15 క్రేన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్, లైటింగ్, బారికేడింగ్, మైక్ ద్వారా ప్రకటనలు, డబ్ల్యూబీఎం రహదారుల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ



తదితర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నగరపాలక సిబ్బందిని కూడా ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని, ప్రస్తుతం అక్కడ సుమారు 9 అడుగుల మేర నీరు నిల్వ ఉన్నట్లు కమిషనర్



తెలిపారు. నన్నూరు టోల్‌గేట్ సమీపంలో, ఉల్లిందకొండ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ ఘాట్‌లోనూ భక్తులకు అవసరమైన సౌకర్యాలను సిద్ధం చేసినట్లు చెప్పారు.

### అధికారులకు సహకరించాలి

నిమజ్జనం సందర్భంగా భక్తులు అధికార యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ కోరారు. విగ్రహాలను నిమజ్జన ప్రాంతాలకు తరలించే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అధికారులు సూచించిన మార్గాలను పాటించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని, క్రేన్ల వద్దకు అనవసరంగా వెళ్లకుండా సిబ్బందికి సహకరించాలని కోరారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండి నిరంతరం పర్యవేక్షణ చేపడతారని కమిషనర్ తెలిపారు. గణనాథుల నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీఈఈ నరేష్, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# నదుల స్వచ్ఛతకు సహకరించండి

## కేసీ కెనాల్ వెంట పారిశుధ్య కార్మికుల అవగాహన ర్యాలీ

## "బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు" అంటూ నినాదాలు




కర్నూలు, సెప్టెంబర్ 20: (మహి న్యూస్): కేసీ కెనాల్ స్వచ్ఛతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య కార్మికులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ర్యాలీలో "వేయొద్దు.. వేయొద్దు.. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు" అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. నదులు, కాలువలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పారిశుధ్య సిబ్బంది ప్రజలకు వివరించారు. కేసీ కెనాల్‌లో చెత్త, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయకుండా సహకరించాలని కోరారు. నీటి వనరుల్లో చెత్త వేయడం వల్ల పరిసరాలు కలుషితం కావడంతో పాటు ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందని, నీటిలోని జీవులకు కూడా హాని కలుగుతుందని తెలిపారు.




"నదులు మనవి.. నీటి జీవుల ప్రాణాల బాధ్యత మనది.. నదులను కలుషితం చేస్తే ముప్పు మనకే" అంటూ వినూత్నంగా అవగాహన కల్పించారు. కేసీ కెనాల్ పరిసరాల్లో చెత్త వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలను కోరారు. నదులు, కాలువల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నదులు, కాలువలను పరిశుభ్రంగా ఉంచేందుకు నగరపాలక సంస్థ నిరంతరం చర్యలు చేపడుతోందని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి చెత్తను నీటి వనరుల్లో వేయకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కల్లూరు మండల ముఖ్య నాయకులతో గౌరు చరిత సమావేశం

## స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై విస్తృత చర్చ





కర్నూలు, సెప్టెంబర్ 20: (మహి న్యూస్): మాధవి నగర్ క్యాంపు కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి, యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై నాయకులతో చర్చించారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలు, నాయకుల మధ్య సమన్వయం, ఎన్నికలకు సిద్ధం కావాల్సిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. కల్లూరు మండలంలోని గ్రామాల వారీగా పార్టీ పరిస్థితులు, స్థానికంగా ఉన్న అంశాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు.





RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

## వినాయకుని లడ్డు దక్కించుకున్న వైష్ణవి స్టడీ సెంటర్



రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 20 : రాయచోటి రాయచోటి ఎస్ఎన్ కాలనీలో గల ఉమామహేశ్వర్ వీధి నందు వినాయక విగ్రహం వద్ద గల లడ్డును వైష్ణవి స్టడీ సెంటర్ వేలంపాటలో 22,225/- దక్కించుకున్నది. ఈ సందర్భంగా వైష్ణవి స్టడీ సెంటర్ నిర్వాహకులు శ్రీనివాసులు మాట్లాడుతూ వినాయక స్వామి లడ్డు వేలంపాటలో దక్కడం నా పూర్వ జన్మ స్వీకృతం అని తెలిపారు. వినాయక కమిటీ సభ్యులు శ్రీనివాసులు, సుజాత దంపతులను ఘనంగా సన్మానించారు. వినాయక స్వామి లడ్డును డప్పు వాయిద్యాలు, బాణ సంచాలతో ఊరేగింపుగా శ్రీనివాసులు ఇంటి వద్దకు ప్రసాదం తెచ్చి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## నేడు (21వ తేదీ) పీజీఆర్ఎస్ కార్యక్రమం..!

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 20: జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

## పెద్దముడియంలో ప్రత్యేక కంటి వైద్య శిబిరం



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ సెప్టెంబర్ 20: జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి, కడప ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రమణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుర్రప్ప, రామసుబ్బారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగపూర్ టౌన్‌షిప్‌లో ఉచిత వైద్య శిబిరం

### 100 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ



కడప జిల్లా, మహి న్యూస్, సెప్టెంబర్ 20: పుట్లంపల్లి సమీపంలోని సింగపూర్ నివాస ప్రాంతంలో నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీ సమగ్ర వైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నివాస ప్రాంతంలోని సంఘ కార్యాలయంలో జరిగిన శిబిరానికి నివాసితుల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో సుమారు 100 మంది నివాసితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, రక్తంలో చక్కెర, గుండె విద్యుత్ పరీక్ష, గుండె అల్ట్రాసౌండ్ పరీక్షలతో పాటు వైద్యుల సంప్రదింపులు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో గుండె వైద్య నిపుణుడు డాక్టర్ నవీద్ అహ్మద్, డాక్టర్ సుప్రజా రెడ్డి, వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది సేవలు అందించారు. నివాసుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డి. రవి కుమార్, మాజీ అటవీశాఖ అధికారి ఎ.ఆర్.ఎం. రెడ్డి మాట్లాడుతూ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన వైద్య బృందానికి, పాల్గొన్న నివాసితులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అధ్యక్షులు డాక్టర్ టి.ఎస్. రెడ్డి మాట్లాడుతూ నివాస ప్రాంతం నగరానికి దూరంగా ఉన్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులోనూ ఉచిత వైద్య శిబిరాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.




## పి.జి.ఆర్.ఎస్ ను సద్వినియోగం చేసుకోవాలి

### పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100

మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబరు 20: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను ఈనెల 21న సోమవారం ఉదయం 10.00 గంటల నుండి అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి తో పాటు, డివిజన్, మండల స్థాయిలో అన్ని కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి అర్జీల వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. మీ కోసం వెబ్ సైట్ లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. ప్రజలు నేరుగా సోమవారం నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు సమర్పించవచ్చని లేదా మీ కోసం వెబ్ సైట్ Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివోవి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, అర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు. అలాగే క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చని చెప్పారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## సుందరయ్య నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ పరిశీలన

### స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్న భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/ఎర్రగుంట్ల, మహి న్యూస్, సెప్టెంబర్ 20: ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు సుందరయ్య నగర్‌లో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఆయన, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడేలా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో స్థానికులు తమ సమస్యలను నాయకుడి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## పిఎం శ్రీ కడప కేంద్రీయ విద్యాలయ పనితీరుపై జాయింట్ సెక్రటరీ ప్రశంసలు..!

### 100 శాతం ఉత్తీర్ణత, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అభినందనీయం




కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 20 : పిఎం శ్రీ పథకం కింద కడప కేంద్రీయ విద్యాలయంలో విద్యా సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్న తీరుపై.. భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ శ్రీ రజత్ కుమార్ సైని ప్రశంసలు కురిపించారు. పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, విద్యార్థుల సమగ్ర వికాసానికి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. పిఎం శ్రీ పథకం అమలు తీరు, పాఠశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, బోధనా విధానాలను సమీక్షించేందుకు కడప కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించిన జాయింట్ సెక్రటరీ శ్రీ రజత్ కుమార్ సైని సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ మునేష్ మీనా పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ఆవరణ, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అనుకూలమైన అభ్యసనా వాతావరణం సంతృప్తికరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యతనిస్తూ పాఠశాలలో 59 కంప్యూటర్లు, 17 స్మార్ట్ తరగతి గదులు అందుబాటులో ఉండటం, ఉపాధ్యాయులు డిజిటల్ బోధనా పద్ధతులతో పాటు దీక్షా వేదికను క్రమం తప్పకుండా వినియోగించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ విద్యా విధానం-2020కు అనుగుణంగా విద్యార్థులకు ఆహ్లాదకరమైన, కృత్యాధారిత బోధన అందించడం, జాదూయీ పిటారా వినియోగం, కృత్రిమ మేధస్సు ఆధారిత నైపుణ్య విద్యను అందిస్తున్న విధానాన్ని ఆయన ప్రశంసించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత పెంపొందించేలా రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాల ద్వారా విజ్ఞాన యాత్రలు నిర్వహించడం కూడా అభినందనీయమన్నారు. విద్యార్థుల సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నూతన మార్గదర్శకాలను పాటిస్తూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సౌకర్యాలపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. కడప కేంద్రీయ విద్యాలయం సాధిస్తున్న ప్రగతిపై జాయింట్ సెక్రటరీ శ్రీ రజత్ కుమార్ సైని ఉపాధ్యాయ బృందాన్ని, ప్రిన్సిపాల్ శ్రీ మునేష్ మీనాను అభినందించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ హెచ్ ఎస్. భావన, డీఈవో శంశుద్దీన్, కేవీ కడప టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 20: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు,



ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు




అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వర్షాలతో!... చేరుతున్న జలకళ!!.....

### లోటు వర్షపాతంలోనూ చెరువులు, కుంటలకు చేరుతున్న నీరు

మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబరు 20: ఎన్నాళ్లుగానో వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నమయ్య జిల్లా ప్రజలకు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొంత ఊరటనిస్తున్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే గణనీయంగా తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ.. తాజాగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, ఫీడర్ చానళ్లు, కాలువల ద్వారా చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లలోకి నీరు చేరుతోంది. దీంతో ఎండిపోయే దశకు చేరిన నీటి వనరుల్లో మళ్లీ జలకళ కనిపిస్తుండగా.. రానున్న రోజుల్లో నీటి సమస్య కొంతమేర తీరుతుందన్న ఆశలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది జిల్లాలో వర్షపాతం పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. సాధారణంగా ఇప్పటివరకు 353 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 149 మి.మీ. మాత్రమే నమోదైంది. దీంతో 57.7 శాతం వర్షపాతం లోటు కొనసాగుతోంది. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పలు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గుతూ వచ్చాయి. చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో కూడా నీటి నిల్వలు తగ్గి కొన్ని వనరులు అడుగంటిపోయే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొంత ఆశాజనక పరిస్థితిని కల్పిస్తున్నాయి. వర్షపు నీరు వాగులు, వంకల ద్వారా ప్రవహిస్తూ మధ్యలో వృథాగా వెళ్లిపోకుండా ఫీడర్ చానళ్లు, కాలువల ద్వారా చెరువులు, కుంటలకు చేరుతోంది. దీంతో ఇప్పటివరకు ఎండిపోయినట్లు కనిపించిన నీటి వనరుల్లోనూ నీటి జాడ కనిపిస్తోంది. వర్షాలు మరికొంతకాలం కొనసాగితే నీటి నిల్వలు పెరగడంతో పాటు భూగర్భ జలాల రీఛార్జ్‌కు కూడా అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

### ఫలిస్తున్న జలధార పనులు

వర్షపు నీటిని సాధ్యమైనంత మేరకు స్థానిక నీటి వనరుల్లోకి మళ్లించి నిల్వ చేసుకునేలా జిల్లా యంత్రాంగం చేపట్టిన జలధార కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఫీడర్ చానళ్లు, కాలువలు, నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణ పనులు ప్రస్తుతం ఉపయోగపడుతున్నాయి. తక్కువ వర్షపాతం నమోదైన పరిస్థితుల్లోనూ కురిసిన కొద్దిపాటి వర్షపు నీటిని చెరువులు, కుంటలకు మళ్లించేందుకు ఈ పనులు దోహదపడుతున్నాయి. సోమల మండలంలోని నంజంపేట సమీపంలోని మలపల్లె సీడీ, పెద్దఉప్పరపల్లి సమీపంలోని వెంకటప్ప చెరువు, పీలేరు మండలంలోని అమ్మ చెరువు, తొపుకుంట, కలికిరి మండలంలోని గడి గ్రామంలోని బొంతలవాని చెరువు, చిన్నపరెడ్డికుంట, పెద్దచెరువులకు వెళ్లే సరఫరా కాలువలు, కలకడ మండలం నడిమిచెర్లలోని అల్లికుంట తదితర ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుతోంది. అదేవిధంగా సోమల మండలం రాచవేటివారిపల్లె పరిధిలోని తేరకాని చెరువు కాలువ పనులు, నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె గ్రామపంచాయతీ పరిధిలో యతల వంక నుంచి అశ్వర్థమ్మ చెరువుకు వెళ్లే ఫీడర్ కాలువ, అగ్రహారం నుంచి నల్లకొండ కాలువ వరకు చేపట్టిన పనులు కూడా వర్షపు నీటిని నీటి వనరులకు మళ్లించడంలో ఉపయోగపడుతున్నాయి.

### మరికొన్ని రోజులు వర్షాలు కురిస్తే!....

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఇదే విధంగా మరో వారం, పది రోజులపాటు కొనసాగితే జిల్లాలోని మరిన్ని చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు నీరు చేరే అవకాశం ఉంది. దీంతో నీటి నిల్వలు పెరగడంతో పాటు భూగర్భ జలమట్టాలు కూడా కొంత మెరుగుపడే అవకాశం ఉంది. ముఖ్యంగా తాగునీటి వనరులకు నీరు అందుబాటులోకి రావడంతో రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరతను కొంతమేర అధిగమించేందుకు అవకాశం ఏర్పడుతుందన్న ఆశలు వ్యక్తమవుతున్నాయి. వర్షపాతం లోటు కొనసాగుతున్నా.. కురిసిన ప్రతి చుక్కను ఒడిసిపట్టి నీటి వనరులకు మళ్లించే చర్యలు సత్ఫలితాలు ఇస్తుండటంతో.. రానున్న వర్షాలపై జిల్లా ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

## సుంకరపాలెంలో ఘనంగా పెన్నల పూజ

### భక్తిశ్రద్ధలతో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు. భక్తిగీతాలతో అలరించిన ద్రాక్షారామ ఆర్కెస్ట్రా భజన బృందం.



తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 20: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం రామాలయం వీధిలో కొలువై ఉన్న శ్రీ బాలగణపతి స్వామివారి ఆలయంలో 13వ గణపతి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆరవ రోజు ఆలయ ప్రాంగణంలో పెన్నల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మంచిలి శివకుమార్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మంత్రోచ్చారణల మధ్య పెన్నల పూజను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గోపిశెట్టి శివయ్య, వెంకటలక్ష్మి, కుడిపూడి దుర్గాప్రసాద్, సమ నిత్య దంపతులు



పీటలపై కూర్చుని గణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పుష్పాలు, పసుపు, కుంకుమ, వివిధ రకాల పూజా సామగ్రితో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సైతం పెన్నల పూజలో పాల్గొని గణపతి స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం ఆలయంలో పెన్నల పూజను ప్రత్యేకంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులలో భక్తిభావాన్ని, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, గణపతి స్వామివారి ఆశీస్సులు విద్యార్థులపై ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పెన్నల పూజ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమం సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతమంతా గణపతి నామస్మరణతో మార్మోగింది. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ద్రాక్షారామ ఆర్కెస్ట్రా భజన బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గణపతి స్వామివారి భక్తి గీతాలను ఆలపిస్తూ భజన బృందం భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తింది. భక్తులు సైతం భక్తి గీతాలకు అనుగుణంగా పాల్గొని స్వామివారిని స్మరించుకున్నారు. 13వ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పెన్నల పూజ కార్యక్రమం విజయవంతంగా జరగడంతో ఆలయ కమిటీ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లోనూ భక్తుల భాగస్వామ్యంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, విద్యార్థినీ విద్యార్థులు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com